
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం, 11 మార్చి 2024






	గరిష్ఠం	కనిష్ఠం
ఖమ్మం	36	25
భద్రాద్రి కొత్తగూడెం	37	25

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారం చేపట్టిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి తొలిసారి భద్రాచలం పర్యటనకు రానున్నారు. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, జిల్లాకు చెందిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహా ఇతర మంత్రులతో సోమవారం భద్రాద్రి జిల్లాలో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల్లో 5వ గ్యారంటీగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకానికి భద్రాచలంలోనే శ్రీకారం చుట్టబోతున్నారు. సాయంత్రం మణుగూరులో ప్రజా దీవెన సభ నిర్వహించనున్నారు.

నేడు భద్రాద్రికి రేవంత్







ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి, అధికారులు

- ముఖ్యమంత్రి హోదాలో తొలిసారి రాక
- రామాలయంలో ప్రత్యేక పూజలు
- ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- గతంలో రెండుసార్లు రామయ్య దర్శనం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి, అధికారులు
- మణుగూరులో ప్రజాదీవెన బహిరంగసభ

భద్రాచలం /కొత్తగూడెం (ఆంధ్రజ్యోతి), మార్చి 10: భద్రాద్రి పర్యటనలో భాగంగా సోమవారం ఉదయం 8.45 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరి యాదగిరిగుట్టకు హెలీకాప్టర్ ద్వారా చేరుకోనున్నారు. అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలంలోని ఐటీడీసీ బీపీఎల్ పాఠశాలలో ఏర్పాటుచేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డుమార్గంలో భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి చేరుకుంటారు. అక్కడ పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం మార్కెట్ యార్డులో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం చుడతారు. భోజన విరామం తరువాత నీటిపారుదల శాఖతోపాటు భద్రాద్రి దేవస్థానం అభివృద్ధిపై సంబంధిత అధికారులతో సీఎం సమీక్షిస్తారు. ఆ తరువాత హెలీకాప్టర్‌లో మణుగూరులో ఏర్పాటు చేసిన 'ప్రజాదీవెన' బహిరంగ సభకు వెళతారు. అక్కడ కార్యక్రమం ముగిసిన తరువాత మణుగూరు నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు హెలీకాప్టర్‌లో చేరుకుంటారు.

ముచ్చటగా మూడోసారి

రేవంత్‌రెడ్డి భద్రాచలానికి రావటం ముచ్చటగా ఇది మూడోసారి. తొలుత 2017 జూన్ 26న తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నేతగా ఐటీసీ పీఎస్‌సీడీ గుర్తింపు సంఘం ఎన్నికల ప్రచారానికి టీఎస్‌టీయూసీ మిత్రపక్షాల తరుపున ప్రచారం నిర్వహించారు. మళ్లీ 2023 ఫిబ్రవరి 14న పీసీసీ అధ్యక్షుడి హోదాలో హాత్‌సే జోడో యాత్రలో భాగంగా భద్రాచలంలో పర్యటించారు. తాజాగా రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రిగా హోదాలో తొలిసారిగా భద్రాచలానికి విచ్చేస్తున్నారు.

శోభాయమానంగా రామాలయ ప్రాంగణం

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం భద్రాద్రి రామయ్య దర్శనానికి విచ్చేస్తుండడంతో దేవస్థానం అధికారులు ఆలయాన్ని పుష్పాలతో సుందరంగా అలంకరించారు. రేవంత్ సీఎం హోదాలో తొలిసారి దేవస్థానానికి విచ్చేస్తుండడంతో ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించనున్న మార్కెట్ యార్డు ప్రాంగణంలోనూ భారీగా ఏర్పాట్లు చేశారు. ఇక భద్రాచలం, సారపాక పట్టణాల్లో సీఎంను స్వాగతిస్తూ పలువురు నాయకులు, అభిమానులు భారీసంఖ్యలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి

సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో భద్రాచలంలో ఏర్పాట్లను ఆదివారం రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోపాటు జిల్లా అధికారులు పరిశీలించారు. ఏర్పాట్ల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో రాబోయే ఐదేళ్లలో అర్హులైన నిరుపేదలకు 20లక్షల ఇళ్లు ఇస్తామన్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500ఇళ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. గ్రామసభలో ఆమోదం మేరకు లబ్ధిదారులను గుర్తించి వారికి రూ.5లక్షలు మంజూరు చేస్తామన్నారు. రెండో విడతలో ఇంటి స్థలం లేని నిరుపేదలకు సైతం ఇళ్లను కేటాయిస్తామని వెల్లడించారు. మంత్రి వెంట ఎమ్మెల్యేలు డాక్టర్ తెల్లం వెంకట్రావు, కోరం కనకయ్య, జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, గిరిజన సంక్షేమ శాఖ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ఏ.శరత్, కలెక్టర్ ప్రియాంక అల, ఎస్పీ రోహిత్‌రాజ్, ఐటీడీఏ పీవో ప్రతీక్‌జైన్, భద్రాచలం ఏఎస్పీ పరితోజ్ పంకజ్, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, భద్రాచలం మాజీఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు పొదెం వీరయ్య, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మాజీ డీసీసీబీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు తదితరులు ఉన్నారు.





మణుగూరులో బహిరంగ సభకు సిద్ధమైన సభాప్రాంగణం

సీఎం పర్యటనకు భారీ బందోబస్తు

భద్రాద్రి జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన నేపథ్యంలో పోలీసుశాఖ పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసింది. సీఎం పర్యటన మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు కలిగిన ఛత్తీస్‌గఢ్, ఒడిశా, ఏపీ సరిహద్దు ప్రాంతాల్లో సాగనుండటంతో పోలీసుశాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేసింది. భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజు పర్యవేక్షణలో ఐదుగురు అడిషనల్ ఎస్పీలు, 15మంది డీఎస్పీలు, 35మంది సీఐలు, 65 మంది ఎస్‌ఐలు, 175 మంది ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 320 మంది కానిస్టేబుళ్లు, 65 మంది మహిళా కానిస్టేబుళ్లు, 230 మంది హోంగార్డులు సహా మొత్తం 1,100మంది పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతం కావటంతో కనీవినీ ఎరుగని రీతిలో బాంబు డిస్పోజబుల్ స్క్వాడ్, డాగ్‌స్క్వాడ్‌తోపాటు ఇతరత్రా సాయుధ బలగాలతో సరిహద్దు ప్రాంతాల్లో భారీ నిఘాను ఏర్పాటు చేశారు.

సీఎం రేవంత్ షెడ్యూల్ ఇలా..

- ఉదయం 8.45కు బేగంపేట ఎయిర్‌పోర్టు నుంచి బయలుదేరతారు
- 9 నుంచి 11 వరకు యాదగిరిగుట్టలో ఆలయ దర్శనం
- మధ్యాహ్నం 12 గంటలకు బూర్గంపాడు మండలం సారపాక హెలీప్యాడ్‌కు చేరుకుంటారు
- 12.10 నుంచి 12.50 వరకు భద్రాచలంలోని శ్రీసీతారామ ఆలయంలో పూజలు
- మధ్యాహ్నం 1గంటకు మార్కెట్ కమిటీ మైదానంలో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి శ్రీకారం
- 2.00 నుంచి 2.30 వరకు భోజనవిరామం
- 2.45 నుంచి 3.30 వరకు అధికారులతో సమీక్షా సమావేశం
- 4.00 గంటలకు హెలీకాప్టర్‌లో మణుగూరు చేరుకుంటారు
- 5.00 వరకు ప్రజాదీవెన బహిరంగ సభలో ప్రసంగిస్తారు
- 5.00 గంటలకు తిరుగు ప్రయాణం
- 6.10కు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు.

సీఎం సారూ.. ఇస్తారా వరాలు!

- భద్రాద్రి ఆలయ అభివృద్ధిపై భక్తుల్లో ఆశలు

5

మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు

- మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి
- బీఆర్‌ఎస్ పాలనలో నిధుల దుర్వినియోగం
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



లచ్చగూడెంలో ఇంటర్నేషనల్ స్కూల్ స్థలాన్ని పరిశీలిస్తున్న భట్టి

చింతకాని, మార్చి 10: ఇందిరాక్రాంతి పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళా సంఘాలకు వచ్చే ఐదేళ్లలో రూ.లక్ష కోట్ల వడ్డీలేని రుణాలను అందించి మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చాలని ప్రభుత్వం యోచిస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. చింతకాని మండలంలో ఆదివారం పర్యటించిన ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అందులో భాగంగా పొద్దుటూరు, రాఘవాపురంలో రూ.17కోట్లతో బీటీ రోడ్లు, పొద్దుటూరు నుంచి పాతర్లపాడుకు రూ.7 కోట్లు, రాఘవాపురం నుంచి అల్లీపురం రూ.2కోట్లు, రాఘవాపురం నుంచి లచ్చగూడేనికి రూ.2.80కోట్లు, రాఘవాపురం నుంచి లచ్చగూడెం మినీ స్టేడియానికి రూ.3.20కోట్ల అంచనాతో చేపట్టిన బీటీ రహదారులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం పొద్దుటూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఇల్లు లేకుండా ఏ ఒక్కరూ ఉండకూడదన్నారు. ప్రజల సొంతింటి కళను నెరవేర్చేందుకే రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 పక్కా ఇళ్లు మొదటి దశలో ఇవ్వనున్నట్టు తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి లబ్ధిదారుడికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందుతుందన్నారు. నేడు సీఎం రేవంత్‌రెడ్డి భద్రాద్రి రాముడి సాక్షిగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టబోతున్నారని తెలిపారు. మహిళా సంఘాలకు సంవత్సరానికి రూ.20నుంచి 25వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందించి వారు వ్యాపారాలు నిర్వహించేందుకు ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేసి పారిశ్రామికవేత్తలుగా మారుస్తామన్నారు. ఇందిరాక్రాంతి పథకాన్ని 12వ తేదీన హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పునఃప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను మళ్లీ గాడిలో పెట్టేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం కలెక్టర్ గౌతమ్, వైరా ఎమ్మెల్యే రాందాసునాయక్, అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే దామోదరరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఈఈ శ్యాంప్రసాద్, పంచాయతీ రాజ్ ఎస్ఈ చంద్రమౌళీశ్వరరావు, ఆర్డీవో గణేష్, మండల నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, ఎంపీపీ పూర్ణయ్య, కిషోర్, గోపి, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, కూరపాటి శిరీష పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ స్కూల్‌కు స్థల పరిశీలన

చింతకాని మండలం లచ్చగూడెంలో ఇంటిగ్రేటెడ్ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్మాణానికి అనువైన స్థలాన్ని డిప్యూటీ సీఎం పరిశీలించారు. కలెక్టర్ గౌతమ్.. గూగుల్ మ్యాప్ ద్వారా మిగిలిన ప్రభుత్వ భూమిని భట్టికి చూపించారు.

కమలం గూటికి జలగం

- కాషాయ కండువా కప్పిన రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జ్ తరుణ్ చూగ్
- ఖమ్మం లోక్‌సభ స్థానంనుంచి పోటీ చేసే అవకాశం



బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్

కొత్తగూడెం, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా కొత్తగూడెం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే జలగం వెంకట్రావ్ ఆదివారం ఢిల్లీలో బీజేపీలో చేరారు. రాష్ట్ర బీజేపీ ఇన్‌చార్జ్ తరుణ్ చూగ్ ఆధ్వర్యంలో జలగం వెంకట్రావ్ బీజేపీలో చేరారు. ఆయన చేతుల మీదుగా బీజేపీ పార్టీ కండువా కప్పుకొన్నారు. జలగంను పార్టీలోకి రావాల్సిందిగా రాష్ట్ర బీజేపీ నేతలు వారం రోజులుగా ఆహ్వానిస్తున్నారు. వారి ఆహ్వానం మేరకు జలగం వెంకట్రావ్ కమలం పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. 2004లో జలగం వెంకట్రావ్ కాంగ్రెస్ పార్టీ తరపున సత్తుపల్లి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2009 ఎన్నికల్లో ఖమ్మం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ టిక్కెట్ దక్కకపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి స్వల్పమెజార్టీతో ఓడిపోయారు. ఆ తర్వాత 2014లో తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుడ్‌బై చెప్పి టీఆర్ఎస్‌లో చేరి కొత్తగూడెం నుంచి పోటీ చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో టీఆర్ఎస్ తరఫున ఏకైక ఎమ్మెల్యేగా జలగం ఎన్నికయ్యారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరఫున కొత్తగూడెం నుంచి మళ్లీ పోటీ చేసిన జలగం వెంకట్రావ్ ఓడిపోయారు. ఆయనపై కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన వనమా వెంకటేశ్వరరావు విజయం సాధించారు. అయితే వనమా వెంకటేశ్వరరావు అతి కొద్దికాలంలోనే అధికార టీఆర్ఎస్ పార్టీలో చేరడంతో 2023 ఎన్నికల్లో వెంకట్రావ్‌కు బీఆర్ఎస్ నుంచి టిక్కెట్ దక్కలేదు. దీంతో ఆయన కొత్తగూడెం నియోజకవర్గంలో నేషనల్ ఫార్వర్డ్‌బ్లాక్ పార్టీ తరఫున టిక్కెట్ తెచ్చుకుని సింహం గుర్తుతో పోటీచేసి ఓటమి చెందారు. జలగం వెంకట్రావ్ ద్వితీయ స్థానంలో నిలిచారు. మొత్తం మీద కొత్తగూడెం నియోజకవర్గం నుంచి ఒకసారి ఎమ్మెల్యేగా విజయం సాధించిన జలగం రెండుసార్లు ఓడిపోయారు. అయినా ఆయన రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ ఆయన్ను తమ పార్టీలోకి ఆహ్వానించింది. బీజేపీలో చేరిన జలగం వెంకట్రావ్ వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఖమ్మం నుంచి పోటీచేస్తారని విశ్వసనీయ సమాచారం. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు కుమారుడైన జలగం వెంకట్రావ్ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో సుపరిచితుడిగా పేరుంది. గతంలో తన తండ్రి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉమ్మడి ఖమ్మంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో జలగం వెంకట్రావ్‌కు సత్తుపల్లి, ఖమ్మం, కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గాల్లో జలగానికి బలమైన కేడర్ ఉంది. ఈ నేపథ్యంలో జలగం చేరికతో ఖమ్మం జిల్లాలో బీజేపీకి కొంత బలం పెరిగే అవకాశం ఉంది.



ఎన్వీ రమణ దంపతులను గజమాలతో సన్మానిస్తున్న దృశ్యం

ఖమ్మం జిల్లాది ఘనమైన చరిత్ర

- అప్పటి నేతలు నీతినిజాయతీలతో రాజకీయాలు చేశారు
- మంత్రి తుమ్మలపై ఆ నమ్మకం ఉంది
- ఆత్మీయ సమ్మేళనంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ
- 'ఎన్టీఆర్‌కు భారతరత్న' పోస్టుకార్డు ఉద్యమానికి మద్దతు

4

నీతివంత పాలన అందించటమే లక్ష్యం

- రాష్ట్రాన్ని బీఆర్‌ఎస్ అప్పులపాలు చేసింది
- కష్టకాలంలోనూ హామీలను అమలు చేస్తున్నాం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



సభలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మంకార్పొరేషన్, మార్చి 10: నీతివంతమైన పాలన అందించమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, పేదల ప్రయోజనాలకు అనుగుణంగా పాలన సాగిస్తున్నామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం బూడిదెంపాడు వద్ద రూ.38.50కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారిని నాలుగులైన్లుగా విస్తరణ పనులకు మంత్రి తమ్మల ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి మాట్లాడుతూ ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందన్నారు. అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి సాహసోపేతంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలా దివాళా తీయించిందని మంత్రి తుమ్మల విమర్శించారు. గత ప్రభుత్వంలో అక్రమాలకు, అవినీతికి పాల్పడిన వారిని వదలబోమని మంత్రి తుమ్మల స్పష్టం చేశారు. సభలో రఘునాథపాలెం ఎంపీపీ భూక్యా గౌరి, జడ్పీటీసీ ప్రియాంక, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తాగునీరు, భూసమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

తాగునీరు, భూ సమస్యలపై ప్రత్యేకదృష్టి పెట్టాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. రఘునాథపాలెం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఏఈలు ప్రతి గ్రామంలో తిరిగి తాగునీటి సరఫరాను పర్యవేక్షించాలన్నారు. మండలంలో పేరుకుపోయిన భూ సమస్యలను పరిష్కరించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. అలాగే అంగన్‌వాడీ, పంచాయతీ, పాఠశాల భవనాలపై దృష్టి పెట్టి, శిథిల భవనాలను తొలగించి కొత్త భవనాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. జీరో కరెంట్ బిల్లు రానివారి సమస్యలను పరిష్కరించాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు.సమావేశానికి రానివారిపై చర్యలు తీసుకుంటానని తుమ్మల హెచ్చరించారు. సమావేశంలో తహసీల్దార్ లూర్ధ్ విల్సన్, ఎంపీడీవో అశోక్, ఐబీ డీఈ యూస్రీలక్ష్మి, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ వాణిశ్రీ, పీఆర్ డీఈ మహేష్, ఎఫ్ఆర్‌వో రాధిక, మండల ప్రత్యేక అధికారి కుమారస్వామి, ఏడీఏ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'బతుకు'నివ్వండి..

- ఏజెన్సీ ప్రాంతంలో చట్టం చట్రంలో వృత్తిదారులు
- ఎండమావిగా ఉక్కు ఫ్యాక్టరీ, 'సీతారామ' నీళ్లు

4



పూటీ లాగుడు పోటీలో తృతీయ స్థానంలో నిలిచిన మధిరకు చెందిన మోహనరావు ఎద్దుల జత

సత్తా చాటిన మధిర ఎడ్లు

- రెండు రాష్ట్రాల స్థాయి పూటీ లాగుడు పోటీలో తృతీయ బహుమతి
- ప్రథమ, ద్వితీయ స్థానాలు ఏపీకి..

మధిరటౌన్, మార్చి10: మధిర శ్రీమృత్యుంజేయ స్వామి దేవాలయం వద్ద మహాశివరాత్రి జాతర సందర్భంగా నిర్వహిస్తున్న తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పూటీ లాగుడు పోటీలు ఆదివారం ముగిశాయి. ప్రథమ, ద్వితీయ స్థానాల్లో ఆంధ్రా ఎద్దులు జతలు నిలవగా, తృతీ స్థానాన్ని మధిర ఎడ్లు సాధించాయి. కృష్ణా జిల్లా కోడూరు మండలం విశ్వనాధపల్లికి చెందిన ఎలిశెట్టి ఉమామహేశ్వరరావు ఎడ్ల జత నిర్ణీత ఐదు నిమిషాల సమయంలో 2,457.8 మీటర్ల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచి రూ.50వేల బహుమతిని గెలుచుకున్నాయి. ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల మండలం మొగులూరుకు చెందిన షేక్ హాజీ ఎద్దుల జత 2,293.3 మీటర్ల దూరం లాగి ద్వితీయ స్థానంలో నిలిచి రూ.40 వేల బహుమతిని గెలుపొందగా, మధిరకు చెందిన ఈధర మోహనరావుకి చెందిన ఎడ్లు 2,114.1 మీటర్ల దూరం లాగి తృతీయ స్థానంలో నిలిచి రూ. 30వేలు గెలుచుకున్నాయి.

నాల్గో బహుమతిని బోనకల్ మండలం మోటమర్రికి చెందిన తాళ్లూరి కృష్ణయ్య ఎడ్లు, గెలుపొందగా, ఐదో బహుమతిని ఆర్.వీ బుల్స్ గెలుచుకున్నాయి. రిఫరీలుగా చైతన్య, నర్సిరెడ్డి వ్యవహరించగా ఆర్గనైజర్లుగా పాటిబండ్ల సత్యంబాబు, చెరుకూరి నాగార్జున, యన్నం కోటేశ్వరరావు, వంకాయలపాటి నాగేశ్వరరావు, కర్నాటి రామారావు, ఈధర మోహనరావు, సత్యనారాయణ రెడ్డి, నవీన్ రెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు.

అంతర్జాతీయ ఓపెన్ లైబ్రరీ డైరెక్టర్‌గా ప్రియాచందన



తల్లాడ, మార్చి 10: అంతర్జాతీయ సైంటిఫిక్ ఓపెన్ లైబ్రరీ బోర్డు డైరెక్టర్‌గా తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన బీఫార్మసీ విద్యార్థిని మారెళ్ల ప్రియాచందన ఎంపికైంది. మనదేశం నుంచి ముగ్గురు ఎంపిక కాగా వారిలో చందన ఒకరు. అంతర్జాతీయంగా వైజ్ఞానిక రంగంలో అన్నిశాఖల్లో శాస్త్రీ విజ్ఞానం, నాణ్యమైన పరిశోధనను పెంపొందించి పాఠకులకు జ్ఞానాన్ని అందించాలనే లక్ష్యంతో అంతర్జాతీయ సైంటిఫిక్ ఓపెన్ లైబ్రరీ కృషిచేస్తుంది.

మహాశివరాత్రి ఆదాయం రూ.15లక్షలు

కూసుమంచి, మార్చి 10: మహాశివరాత్రి పురస్కరించుకుని కూసుమంచి గణపేశ్వరాలయానికి ఈఏడాది రూ.15 లక్షల ఆదాయం లభించింది. హుండీల ద్వారా రూ.3.36 లక్షలు, టికెట్ల ద్వారా రూ.3.32లక్షలు, దుకాణాల వేటంపాటల ద్వారా రూ.1.94 లక్షలు, కల్యాణ కట్నాలు రూ.20వేలు, షాపుల ద్వారా రూ.77,800 మొత్తం రూ.9,59,832 ఆదాయం లభించింది. వీటితో పాటు కట్న కానుకలు, విరాళాలు ద్వారా రూ.5లక్షలు ఆదాయం లభించినట్లు ఎండోమెంట్ అధికారులు, పాలకమండలి సభ్యులు తెలిపారు.

'బతుకు'నివ్వండి..

మన్యంలో హక్కులు లేకుండా జీవిస్తున్న గిరిజనేతరులు

- ఏజెన్సీ ప్రాంతంలో చట్టం చట్రంలో వృత్తిదారులు
- ఎండమావిగా మారిన ఉక్కు ఫ్యాక్టరీ, సీతారామ ప్రాజెక్టు
- సీఎం రేవంత్ పైనే మన్యం ప్రజల ఆశలు



బయ్యారంలోని ఇనుప ఖనిజ నిక్షేపాలు

ఇల్లెందు, మార్చి 10: మన్యంలో తరతరాలుగా నివసిస్తున్న గిరిజనేతరులు జీవించే హక్కులు లేక తల్లడిల్లుతున్నారు. కుల వృత్తులు చేసుకునే హక్కులు కోల్పోతున్నారు. దశాబ్దాలుగా జీవిస్తున్నా భూములపై హక్కులు లేక దిన దిన గండంగా బతుకుతున్నారు. ఉక్కు ఫ్యాక్టరీ హామీలు అమలు కాక, గొంతు తడుపుతుందని భావిస్తున్న సీతారామ ప్రాజెక్టు పూర్తికాక ఏజెన్సీ చట్టాల చట్రంలో నలిగిపోతున్నారు. సంచలన నిర్ణయాలతో ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అటవీ ప్రాంతాల ప్రజల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

జీవించే హక్కు కోసం తండ్లాట..

ఏజెన్సీలో స్వాతంత్ర్యానికి పూర్వం నుంచి బతుకుతున్న గిరిజనేతరులు నేడు జీవించే హక్కు కోసం తల్లడిల్లుతున్నారు. గిరిజనలతో పాటు తరతరాలుగా ఇరుగు పొరుగుగా జీవిస్తున్నా ఓటు హక్కు మినహా ఇతరహక్కులకు నోచుకోవడం లేదు. వారసత్వంగా లభించిన భూములు, నివేశన స్థలాలు, ఇళ్లపై హక్కులు లేని దుస్థితిలో ఉన్నారు. పిల్లల చదువులు, వివాహాలు, ఇతర ఆర్థిక అవసరాలకు భూములు అమ్ముకునే అవకాశం లేక గొల్లుమంటున్నారు.

చట్టాలను సమీక్షించాలి..

గిరిజనులకు నష్టం కలగని రీతిలో చట్టాలు సమీక్షించాల్సి ఉంది. భూములపై హక్కులు కల్పించి స్వేచ్ఛగా క్రయ, విక్రయాలు జరుపుకునే అవకాశాలు కల్పించాల్సి ఉంది. పోడు భూముల్లో గిరిజనేతరులకు సైతం పట్టాలు ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించినప్పటికి రాష్ట్రంలో మాత్రం పోడు పట్టాలు దక్కలేదు. తెలంగాణ రాష్ట్రం వస్తే తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశించిన గిరిజనేతరులను పాలకులు పట్టించుకోవడం లేదు.

ఫిఫ్టీ- 50 ప్రతిపాదనలు ఎక్కడ..?

రాష్ట్ర విభజన అనంతరం షెడ్యూల్ ప్రాంతాల్లో 50 శాతం గిరిజనులు నివసిస్తున్న గ్రామాలను ఏజెన్సీ గ్రామాలుగా పరిగణిస్తూ, 50 శాతం గిరిజనులు లేని గ్రామాలు నాన్ ఏజెన్సీ గ్రామాలుగా గుర్తిస్తూ ప్రతిపాదనలు పంపాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. కాని బీఆర్ఎస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలను పెడచెవిన పెట్టింది. కల్లుగీత వృత్తి జీవనాధారంగా ఉన్న గౌడ కులస్థులు సహకార సంఘాలను గత ప్రభుత్వం రెన్యూవల్ చేయకపోవటంతో వారు ఉపాధి కోల్పోయినట్లు వాపోతున్నారు.

సాగునీరు, ఉపాధి కరవు..

ఇల్లెందు నియోజకవర్గంలోని టేకులపల్లి మండలం రోళ్లపాడు వద్ద 2016 ఫిబ్రవరి 16న సీతారామ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి దశాబ్ద కాలం గడిచినా తట్టెడు మట్టి కూడా తవ్వకాలు జరగలేదు బయ్యారం మండలంలో ఉక్కు పరిశ్రమ నిర్మిస్తామని విభజన చట్టంలో ప్రకటించినప్పటికి గత దశాబ్దా కాలంగా నిరాశే మిగిలింది. జిల్లా పర్యటకు వస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి ఏజెన్సీ ప్రజల గోడు ఆలకించాలని, తమకు జీవించే హక్కులు కల్పించాలని గిరిజనేతరులు మొరపెట్టుకుంటున్నారు.

ఘనంగా గౌరీ శంకర కల్యాణం

చర్ల, మార్చి 10: మండలంలోని పెద్దమిడిసిలేరు గ్రామంలోని గౌరీ శంకర ఆలయంలో ఆదివారం ఉదయం గౌరీ శంకర స్వామి వార్ల కల్యాణ మహోత్సవం ఘనంగా జరిగింది. ఉత్సవ మూర్తులను పుర వీధుల గుండా ఊరేగించార దుమ్ముగూడెం, వెంకటాపురం, సరిహద్దునున్న ఛత్తీస్‌గడ్ నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

అణగారిన వర్గాల విద్యాజ్యోతి పూలే

నేలకొండపల్లి, మార్చి10: అణగారిన వర్గాల ప్రజలకు విద్యను అందించటమేలక్ష్యంగా పని చేసిన గొప్ప సంఘ సేవకురాలు సావిత్రీబాయి పూలేనని బీజేపీ జిల్లా నాయకుడు తాండ్ర వినోద్‌రావు అన్నారు. ఆదివారం నేలకొండపల్లి బీజేపీ కార్యాయంలో జరిగిన సావిత్రీ బాయిపూలే వర్ధంతి సభలో వినోద్‌రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా మహిళలకు ప్రధానంగా అణగారిన వర్గాలకు విద్యనందించిన గొప్ప వ్యక్తి పూలే అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు చావా కిరణ్‌కుమార్, మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, కోటి హనుమంతరావు, జ్ఞానరత్నం పాల్గొన్నారు.

ఆర్టీసీలో అస్తవ్యస్తంగా శ్వాస పరీక్షలు

- మద్యం తాగకున్నా స్పందించిన బ్రీత్ ఎనలైజర్
- ఆర్టీసీ డ్రైవర్‌కు విధుల నిరాకరణ
- ఆందోళనకు దిగిన బాధితుడు, కార్మిక సంఘాల నాయకులు



డిపో ముందు నిరసన తెలుపుతున్న డ్రైవర్ నాగేశ్వరరావు

మధిరటౌన్, మార్చి10: మధిర ఆర్టీసీ డిపోలో శ్వాస విశ్లేషణ(బ్రీత్ ఎనలైజర్) పరీక్షలు అస్తవ్యస్తంగా నిర్వహిస్తున్నారని డ్రైవర్ సంద్ర నాగేశ్వరరావు ఆదివారం డిపో గేట్ ముందు బైఠాయించి అందోళనకు దిగారు. డ్రైవర్ నాగేశ్వరరావు ఉదయం డ్యూటీకి రాగా బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేశారు. అందులో 16 పాయింట్లు వచ్చాయని, మద్యం సేవించినట్లు పరీక్షలో కనిపిస్తుందని అధికారులు డ్యూటీ ఇచ్చేందుకు నిరాకరించారు. దీంతో నాగేశ్వరరావు తనకు మద్యం అలవాటు లేదని, కనీసం గుట్కా కూడా తీసుకోనని పేర్కొన్నారు. తాను మద్యం సేవించినట్లు పరీక్షలో రావడం అన్యాయమని, ఇది తన వ్యక్తిత్వానికి మాయని మచ్చఅని నిరసనకు దిగారు. విషయం తెలుసుకున్న కార్మిక సంఘ నాయకులు డిపో వద్దకు చేరి దీక్ష చేస్తున్న నాగేశ్వరరావుకు మద్దతు తెలిపారు. గతంలో ఇదే డిపోలో డ్రైవర్‌గా పనిచేసే వెంకట్‌కు డిపో వద్ద నిర్వహించిన బ్రీత్ ఎనలైజర్ పరీక్షలో 369 పాయింట్లు వచ్చాయని, ఎర్రుపాలెం పోలీస్ స్టేషన్‌లో శ్వాసపరీక్ష చేయించుకుంటే సున్నా పాయింట్లు వచ్చాయని తెలిపారు. మధిర డిపోలో పరీక్ష చేసే పరికరంలో తేడాలున్నాయని అన్నారు. టౌన్ ఎస్ఐ సంధ్య డిపో వద్దకు చేరుకొని ఉన్నతాధికారులతో మాట్లాడతానని హామీ ఇవ్వడంతో దీక్ష విరమించారు. ఈ ఆందోళనలో సీఐటీయూ నాయకులు శీలం నరసింహారావు, ప్రభాకర్, ఏఐటీయూసీ నాయకులు బెజవాడ రవిబాబు, తిమ్మినేని రామారావు, ఐఎన్‌టీయూసీ నాయకులు కోరంపల్లి అంకమరావు, వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కవులు.. పీడిత వర్గాల గొంతుకవ్వాలి

'లావా' కవితా సంపుటి ఆవిష్కరణ సభలో మాస్‌లైన్ జాతీయ నాయకుడు పోటు రంగారావు



లావా కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఖమ్మం సాంస్కృతికం, మార్చి 10: కవులు పీడిత వర్గాల గొంతుక కావాలని, అణిచివేతకు గురవతుఉన్న వర్గాలకు ధైర్య వచనంగా తమ సాహిత్యాన్ని సృష్టించాలని సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ జాతీయ నాయకుడు పోటు రంగారావు అన్నారు. కవి యనగందుల దేవయ్య రచించిన కవితా సంపుటి లావా పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ఖమ్మం ఐఎంఏ హాల్‌లో జరిగింది. ప్రముఖ సాహితీవేత్త మువ్వా శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సభలో పోటు రంగారావు మాట్లాడుతూ.. బాధిత, పీడిత అణగారిన వర్గాల తరుపున పోరాడుతున్న కమ్యూనిస్టు పార్టీల భావ జాల నేపథ్యంలో సాహిత్య ప్రయాణం సాగించాలన్నారు. కవులు, రచయితలు ఆదిశగా తమ ఆలోచనలు చేయాలన్నారు. సాహిత్య కారులు అభ్యుదయ పథం వైపు ఉండాలన్నారు. దురదృష్టవశాత్తు కొందరు పాలక వర్గాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, సృజన శీలురంతా ప్రజా పక్షం వహించాలన్నారు. మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు రాయల చంద్రశేఖర్ మాట్లాడుతూ అభ్యుదయ వామపక్ష భావజాలం నేపథ్యం నుంచి వచ్చిన కవి దేవయ్య తన రచనల్లో తన వైఖరిని తేటతెల్లం చేశారన్నారు. టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ నేత వి. మనోహర్ రాజు మాట్లాడుతూ ఫాసిస్టు శక్తులకు వ్యతిరేకంగా సాహితీవేత్తలు తమ కలాలను పదునెక్కించాలన్నారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర కన్వీనర్ కె. ఆనందచారి మాట్లాడుతూ ప్రస్తుత తరుణంలో కవుల సంఖ్య పెరుగుతున్నప్పటికీ వారిలో మరింత సామాజిక అధ్యయనం అవగాహన పెంచాలన్నారు. భువన విజయం సాహిత్య సంస్థ బాధ్యుడు వంకాయల చంద్రశేఖర్, జాషువా సాహిత్య సంస్థ బాధ్యుడు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కవి యనగందుల దేవయ్య, కవులు కన్నెగంటి వెంకటయ్య, మేడగాని శేషగిరి, పోతగాని సత్యనారాయణ, ఇబ్రహీం నిర్గున్, రాణాప్రతాప్, పరంజ్యోతి పాల్గొన్నారు.

ఖమ్మం జిల్లాది ఘనమైన చరిత్ర

● ఆత్మీయ సమ్మేళనంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ



ఖమ్మం, మార్చి10(ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా చైతన్యవంతమైన ప్రాంతమనీ, ఘనమైన చరిత్ర ఉందనీ సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ తెలిపారు. ఖమ్మంలోని స్వర్ణభారతి కళ్యాణ మండపంలో ఆదివారం అభిమానులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో జస్టిస్ రమణ తన సతీమణి శివమాలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహిత్యంలో కానీ, రాజకీయ గ్రంథాలలో కానీ ఖమ్మం జిల్లా చరిత్రను గుర్తించవచ్చన్నారు. పోరాటాల ఖిల్లాగా ఖమ్మంను గుర్తిస్తామన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య వీరతెలంగాణ విప్లవ పోరాటంపై పుస్తకం రాశారనీ, ఆ పుస్తకం చదివితే ఈ ప్రాంతంలో సంచరించినట్టు ఉంటుందన్నారు. అప్పటి సాయుధ పోరాటాల ప్రభావం ఖమ్మం జిల్లాకు దగ్గరగా ఉన్న తమ ప్రాంతాలపై కూడా ఉండేదన్నారు. తన తండ్రి కాలంలో ఇక్కడి రజాకారులకు వ్యతిరేకంగా మద్ధతిచ్చి నిలబడ్డారనీ, వారు ఆ సంఘటనలు చెబుతుంటే మంచి అనుభూతి పొందేవారమన్నారు. ఈ జిల్లానుంచి రాష్ట్రానికి నాయకత్వం వహించిన జలగం వెంగళరావు, బోడేపుడి వెంకటేశ్వరరావు, నల్లమల గిరిప్రసాద్, రజబ్‌అలీ, చిర్రావూరి లక్ష్మీ నర్సయ్య, మంచికంటి రామకృష్ణయ్య, శీలం సిద్ధారెడ్డి లాంటి అనేక మంది జిల్లా అభివృద్ధికి కృషి చేశారన్నారు. వారంతా నీతి, నిజాయతీలతో రాజకీయాలు నడిపారన్నారు. అటువంటి సంప్రదాయాలను, సంస్కృతిని కాపాడేందుకు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు కృషిచేస్తున్నారన్నారు. ప్రత్యేకించి తుమ్మల నాగేశ్వరరావుపై ఎంతో నమ్మకం ఉందన్నారు. ఆయన మంత్రిగా పనిచేసినప్పుడు తాను అడిషనల్ అడ్వకేట్ జనరల్‌గా ఉన్నాననీ, ఏదైనా ఒక ఉద్యోగం ఉంటే ఖమ్మంలో ఫలానా వారు ఉన్నారని చెప్పేవారన్నారు. ఖమ్మం జిల్లాతో భౌగోళిక అనుబంధం ఉందనీ, అనేకమంది మిత్రులు, ఉపాధ్యాయ వృత్తిలో ఉండి మా గ్రామానికి చెందిన వారు ఖమ్మంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారన్నారు. హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడు ఖమ్మంలో కోర్టు భవనాలు నిర్మించాలని ప్రయత్నం చేశామన్నారు. తాను చీఫ్ జస్టిస్‌గా ఉన్నప్పుడు ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురిని హైకోర్టు న్యాయమూర్తులుగా నియమించగలిగానన్నారు. సాధారణంగా అధికారంలో ఉన్నవారితో అయితే పనులు అవుతాయన్న ఉద్దేశంతో సన్మానాలు చేస్తారనీ, కానీ పదవీ విరమణ చేసిన తర్వాత కూడా తనకు ప్రత్యేకంగా సన్మానం చేసినందుకు నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

తెలుగువారికి గౌరవాన్ని తెచ్చిన వ్యక్తి ఎన్వీ రమణ: మంత్రి తుమ్మల



తెలుగు ప్రజల కీర్తి పతాకాన్నీ ఢిల్లీ ఎర్రకోటపై ఎగురవేసిన వ్యక్తి ఎన్వీ రమణ అనీ, ఆయన ప్రపంచవ్యాప్తంగా తెలుగువారికి గౌరవాన్ని తెచ్చారని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అభిమానుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న తుమ్మల ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్వీ రమణలోని నిజాయతీ, నిబద్ధతలే ఆయనని చీఫ్ జస్టిస్ స్థానంలో నిలబెట్టాయన్నారు. ఆయన ఎదుగుదలను భారత ప్రభుత్వం కూడా ఆపలేకపోయిందన్నారు. అల్మట్టి ఎత్తుపెంచే విషయంలో దాన్ని పెంచకుండా అడ్డుపడి పోరాటం చేసిన వ్యక్తుల్లో రమణ ఒకరన్నారు. టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల రవీంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎన్వీ రమణ విద్యార్థి దశ నుంచే వామపక్ష భావాజాలం ఉన్న వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోయిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎంపీ నామా నాగేశ్వరరావులు వేదికమీద తమ సందేశం పంపి శుభాకాంక్షలు తెలిపారు. ఖమ్మం కమ్మ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎర్నేని రామారావు అధ్యక్షత వహించిన ఈ అభిమానుల ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా ఆయన నందమూరి తారక రామారావుకు భారతరత్న ఇవ్వాలంటూ ఆయన అభిమానులు శ్రీకారం చుట్టిన రాష్ట్రపతికి పోస్టుకార్డు ఉద్యమానికి ఆయన ఎన్వీ రమణ మద్దతు తెలిపారు. అంతకుముందు అయన కమ్మ బాలికల హాస్టల్‌లో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ తాతామధు, పలు పార్టీల రాజకీయ నేతలు వాసిరెడ్డి రామనాథం, గల్లా సత్యనారాయణ, రాజేంద్రప్రసాద్, పోటు ప్రసాద్, గోకినపల్లి వెంకటేశ్వర్లు, పోట్ల నాగేశ్వరరావు, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని సంతకం చేస్తున్న ఎన్వీ రమణ

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

● రూ.7.40 లక్షల విలువైన సొత్తు స్వాధీనం



వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రఘు

కల్లూరు, మార్చి 10: పట్టణంలో అంతర్ రాష్ట్ర దొంగల ముఠా నుంచి రూ.7.40 విలువైన బంగారు అభరణాల సొత్తుతో పాటుగా వారిని అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్లు కల్లూరు ఏసిపి రఘు తెలిపారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఆదివారం మధ్యహ్న సమయంలో ఖమ్మం వైపు నుంచి తిరువూరు వైపునకు వెళ్తున్న ఓ కారును తనిఖీ చేయటానికి పోలీసులు సిద్ధం అయ్యారన్నారు. వాహనాన్ని ఆపకుండా అతివేగంగా వెళ్తుండగా ఎస్ఐ అనుమానంతో వెంబడించి పట్టుకున్నట్లు వివరించారు. సదరు వాహనంలో నలుగురు వ్యక్తులు ఉన్నారని అందులో నీలాల అనిల్‌కుమార్ (రాంనగర్ సత్తుపల్లి), భీమిని రాజ్‌కుమార్ అలియాస్ తిల్లు (మందమర్రి మంచిర్యాల జిల్లా), రామ్‌దేనికి రాజ్‌కుమార్ (రామరావుపల్లి, పెద్దపల్లి జిల్లా), కారం రాము (వేమికుండా, ముల్కలపల్లి మండలం), కాగా పైన తెలిపిన వారిలో అనిల్‌కుమార్, రాజ్‌కుమార్‌లు నెల రోజుల క్రితం నుంచి తెలుగు రాష్ట్రాల్లో పలు ప్రాంతాల్లో 17 చోట్ల దొంగతనాలు చేశామని వారు తమ విచారణలో ఒప్పుకున్నారని తెలిపారు. మిగిలి నిందితుల్లో రామ్‌దేనికి రాజ్‌కుమార్, కారం రాములు చోరీ చేసిన సొత్తును అమ్మడంలో సహాయం చేసే వాళ్లుగా విచారణలో తెలిసిందని వివరించారు. వారి వద్ద నుంచి బంగారం వస్తువులు రూ.97,02 తోపాటుగా వెండి 120 గ్రా ములు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మొత్త మీద వారి వద్ద నుంచి రూ.7.40 లక్షల విలువ గల సొత్తును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. ఈ సందర్భంగా కేసును ఛేదించిన ఎస్ఐ షాకీర్‌తో పాటు ఏఎస్ఐ చారి, హెచ్‌వో శ్రీనివాసరావు, పిసి రమేష్, జగదీష్, ప్రసాద్, శ్రీనివాసరావులను సీపీ సునీల్‌దత్ అభినందించారని ఏసిపి వివరించారు. కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ, రూరల్ సీఐలు కిరణ్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

గంజాయి నిందితుల రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ ఇంద్రసేనారెడ్డి

జూలూరుపాడు, మార్చి10: గంజాయిని కారులో తరలిస్తూ పట్టుబడ్డ ఇద్దరు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. హైదారాబాద్ గోషామహల్‌కు చెందిన దత్తాత్రేయ ఉపాధ్యాయ, రామారావు బిలాదర్ ఇద్దరు వ్యక్తులు కలిసి నిషేధిత గంజాయిని శనివారం సాయంత్రం కొత్తగూడెం నుంచి ఖమ్మం వైపు కారులో తరలిస్తుండగా, నమ్మదగిన సమాచారం మేరకు జూలూరుపాడు ఇన్‌చార్జి ఎస్ఐ మాదినేని రవి తన సిబ్బందితో కలిసి జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ఎదురుగా వాహన తనిఖీల్లో గంజాయిని పట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి 61 కేజీల గంజాయితో పాటు, మూడు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కారును సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుబడిన గంజాయి విలువ రూ.12.20 లక్షలు ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దు అని, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే ఉక్కుపాదం మోపుతామన్నారు. ఈ సమావేశంలో హెడ్‌కానిస్టేబుల్ దయానంద్, సిబ్బంది సూర్యం, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

దమ్మపేట, మార్చి 10: బాలికను వేధిస్తున్న యువకుడిపై దమ్మపేట పోలీసులు ఆదివారం పోక్సోకేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికను, సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామానికి చెందిన యువకుడు కొంత కాలంగా మైనర్ బాలికను వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ విషయమై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి తెలిపారు.

వేర్వేరు కారణాలతో నలుగురు ఆత్మహత్య

సత్తుపల్లిరూరల్, మార్చి10: అప్పులు తీర్చలేక ఓ వ్యక్తి పురుగు మం దు సేవించి ఆత్మహత్యకు పాల్పడగా, చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని యాతాలకుంట గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. హెడ్ కానిస్టేబుల్ ఇజ్జగాని చెన్నారావు తెలిపిన వివరాల ప్రకారం..గ్రామానికి చెందిన వడుగు రవికుమార్ (38) నూతన గృహా న్ని నిర్మించేందుకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చలేక మనస్తాపానికి గురై శనివారం రాత్రి పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సత్తుపల్లిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి సోదరుడు లక్ష్మీనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మంక్రైం, మార్చి10: రైలు కింద పడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రానికి చెందిన ఠాకూర్ విజయ్‌సింగ్ (35) నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో ఖమ్మం నుంచి విజయవాడ వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాల కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రైల్వే ఎస్ఐ భాస్కరరావు మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురికి తరలించారు.

బూర్గంపాడు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆటో డ్రైవర్ ఆత్మహత్య చేసుకు న్న ఘటన ఆదివారం మోరంపల్లిబంజరలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని మోరంపల్లిబంజర గ్రామానికి చెందిన బిల్లా రాం బాబు(34) అనే వ్యక్తి ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అతడికి గౌతపురానికి చెందిన అరుణతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. నెల రోజుల నుంచి భార్య, పిల్లలతో కలిసి గౌతపురంలో ఉంటున్నాడు. కాగా ఈ నెల 7న భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో భార్య, మృతుడి అత్త సుగుణ, బావమర్దులు రవి, కిరణ్‌లు అతడిపై దాడి చేయడంతో వారి నుంచి తప్పించుకుని మోరంపల్లిబంజర వెళ్లినట్లు తెలిపారు. కాగా నెల 9న రాంబాబు వద్దకు వెళ్లి అతడి భార్య అసభ్య పదజాలంతో దూసించినట్లు పేర్కొన్నారు. దీంతో మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి తల్లి లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగభిక్షం తెలిపారు.

ఖమ్మం క్రైం: ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం సాయంత్రం ఖమ్మం నగరంలో జరిగింది. నకిరేకల్ మండలం మోదిగినగూడెం గ్రామానికి చెందని వలిశెట్టి మనోజ్‌కుమార్(30) నగరంలోని త్రీటౌన్ ప్రాంతంలో నివాసం ఉంటూ వ్యయసాయ మార్కెట్లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. మార్కెట్లో ఆదివారం సాయంత్రం వరకు పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన అతను ఉరేసుకున్నాడు. కుటంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

ప్రశాంతంగా ఎస్సీ స్టడీ సర్కిల్ అర్హత పరీక్షలు

ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 10: ఎస్సీ నిరుద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్సీ స్టడీ సర్కిల్ అర్హతా పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించిన పరీక్షకు ఉమ్మడి జిల్లా నుంచి మొత్తం 539 మంది దరఖాస్తులు చేయగా, 380 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. 159 మంది అభ్యర్థులు హాజరు కాలేదు. పరీక్షలను ఖమ్మం సాంఘిక సంక్షేమశాఖ డీడీ కస్తాల సత్యనారాయణ పర్యవేక్షించారు.



పరీక్షలను పరిశీలిస్తున్న సత్యనారాయణ

115 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

తిరుమలాయపాలెం, మార్చి10: అక్రమంగా నిల్వచేసిన వంద క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గోపాలపురంలో ఖమ్మం టాస్క్‌ఫోర్స్, తిరుమలాయపాలెం పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రాత్రి పట్టుకున్నారు. పిండిప్రోలకు చెందిన మరికంటి రామయ్య, ఖమ్మంరూరల్ మండలం గోళ్లపాడుకు చెందిన పెద్దులు, ఖమ్మానికి చెందిన జగదీష్‌లు కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో నుంచి సుమారు వంద క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని సేకరించారు. గోపాలపురం ప్రాంతంలో నిల్వ చేసి లారీల్లో ఖమ్మానికి తరలించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం అందుకున్న టాస్కుఫోర్సు ఏసీపీ మల్లయ్య ఆధ్వర్యంలో టీం సభ్యులు శ్రీనివాసాచారి, హరి, జనార్దన్, తిరుమలాయపాలెం పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో దాడి చేసి పట్టుకున్నారు. లారీతో పాటు బియ్యాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

అశ్వాపురం: మండల పరిధిలోని గొల్లగూడెం సీతారామ కెనాల్ వద్ద ఆదివారం ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 15క్వింటాళ్ల రేషన్ బియ్యం పోలీసులు పట్టుకున్నారు. వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కోడిపందేల స్థావరంపై దాడి

సత్తుపల్లిరూరల్, మార్చి10: సత్తుపల్లి మండలం రేజర్ల గ్రామ శివారులో కోడిపందేల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు వ్యక్తులు, 9ద్విచక్ర వాహనాలు, 4సెల్‌ఫోన్లు, 2పందెంపుంజులు, రూ.4,070నగదు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ టీ.కిరణ్ తెలిపారు.

విత్తన దుకాణ యజమానికి షోకాజ్ నోటీసు



వరి పొలాలను పరిశీలిస్తున్న ఏవో

ఏన్కూరు, మార్చి10: ఏన్కూరులోని మురళీధర ఏజెన్సీస్ విత్తన దుకాణాన్ని మండల వ్యవసాయశాఖ అధికారులు ఆదివారం తనిఖీ చేశారు. గార్లొడ్డు గ్రామానికి చెందిన వరి రైతులు వరి విత్తనాల వల్ల పంటకు నష్టం జరిగిందని శనివారం విత్తన దుకాణం ఎదుట నష్టపరిహారం చెల్లించాలని ఆందోళన చేసిన విషయం పత్రికల్లో ప్రచురితమైన కథనానికి స్పందించారు. బిల్లులు అసంపూర్తిగా ఉండడంతో దుకాణ యజమానికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్టు ఏవో నరసింహారావు తెలిపారు. అనంతరం గార్లొడ్డు గ్రామంలో నష్టపోయిన రైతుల వరి పొలాలను పరిశీలించారు. ఈకార్యక్రమంలో ఏవో నరసింహారావు, ఏఈవో భాగ్యలహరి రైతులు పాల్గొన్నారు.

నేడు పండితాపురం సంత వేలం

కామేపల్లి, మార్చి 10: కామేపల్లి మండలం పండితాపురం గ్రామంలో శ్రీకృష్ణ ప్రసాద్ పశువుల సంత వేలాన్ని సోమవారం నిర్వహిస్తున్నటు పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ రవిందర్, పంచాయతీ కార్యదర్శి గుగులోత్ నెహ్రూ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

రెవెన్యూ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలి

సీఎంను కోరిన డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్లు

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థలను బలోపేతం చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని డిప్యూటీ కలెక్టర్ల, రాష్ట్ర తహసీల్దార్ల అసోసియేషన్ల సభ్యులు కోరారు. ఆదివారం డిప్యూటీ కలెక్టర్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె. రామకృష్ణ, ఎస్.ఆర్ సరిత, తెలంగాణ తహసీల్దార్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.రాములు, రమేశ్ పాక, అసోసియేట్ ప్రెసిడెంట్ ఫూల్‌సింగ్ సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. రెవెన్యూ వ్యవస్థ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలు, పూర్వ వీఆర్‌ఓ, వీఆర్‌ఏల పెండింగ్ సమస్యలు, తహసీల్దార్ల అద్దె వాహనాలకు బిల్లుల చెల్లింపు, క్యాడర్ బలోపేతం, తదితర అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు తర్వాత రెవెన్యూ డివిజన్లు, మండలాలు పెరిగినా.. రెవెన్యూ ఉద్యోగుల సంఖ్య పెరగలేదని చెప్పారు. దీంతో ఉన్న ఉద్యోగుల మీదనే పని భారం పడుతోందని, జిల్లాలు, మండలాలు, రెవెన్యూ డివిజన్లకు అనుగుణంగా క్యాడర్‌ను పెంచాలని సీఎంను కోరారు. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ ఉద్యోగి ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. జీఏడీ పరిధిలోని అదనపు కలెక్టర్ల పోస్టుల వ్యవహారాన్ని రెవెన్యూ విభాగ పరిధిలోకి తేవాలని విజ్ఞప్తి చేశారు. అన్ని అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించినట్టు అసోసియేషన్ల ప్రతినిధులు తెలిపారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

- తొలిరోజు పూజల్లో పాల్గొననున్న సీఎం
- పట్టు వస్త్రాలు, తలంబ్రాల సమర్పణ


లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో విద్యుద్దీపాల వెలుగులు

యాదగిరిగుట్ట, మార్చి 10: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. సోమవారం ఉదయం 10గంటలకు ప్రధానాలయ ముఖ మండపంలో అర్చక, వేదపండితుల బృందం సంప్రదాయరీతిలో లక్ష్మీనృసింహుల తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టనున్నారు. తొలిరోజు వైదిక పూజల్లో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్నారు. ఆయన సోమవారం ఉదయం 9గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో కొండపైకి చేరుకుని వీవీఐపీ అతిథి గృహంలో కాసేపు విశ్రాంతి తీసుకుంటారు. 9.30గంటలకు ప్రధానాలయంలో స్వయంభువులను దర్శించుకుంటారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవస్థాన అధికారులకు అందజేస్తారు. ఉదయం 11గంటలకు రేవంత్ హెలికాప్టర్‌లో భద్రాచలం సీతారామచంద్రస్వామి ఆలయానికి బయల్దేరివెళతారు. సీఎం రేవంత్ పర్యటన నేపథ్యంలో కొండ కింద పాత గోశాల ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న హెలీప్యాడ్ వద్ద పనులను ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ఆదివారం పరిశీలించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు పూజల్లో సీఎంతో పాటు డిప్యూటీ సీఎం భట్టి, పలువురు మంత్రులు పాల్గొంటారని అధికారులు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఈసారి రూ.1.60కోట్లు కేటాయించామని, అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో రామకృష్ణారావు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 18న జరిగే తిరుకల్యాణోత్సవంలో భక్తులు పాల్గొనే విధంగా 600 టికెట్లను విక్రయిస్తామని, ఒక్కో టికెట్ ధర రూ.3వేలని తెలిపారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 17న రాత్రి ఎదుర్కోలు, 18న రాత్రి తిరుకల్యాణోత్సవం, 19న రాత్రి దివ్య విమాన రథోత్సవ ఘట్టాలను నిర్వహిస్తారు. ఈ నెల 20న మహాపూర్ణాహుతి, చక్రతీర్థ స్నానం ఉంటుంది. 21వ తేదీన అష్టోత్తర శతఘటాభిషేకం, పండిత సన్మానంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

లోకం తీరు



సీఎం సారూ.. ఇస్తారా వరాలు..

- భద్రాద్రి ఆలయ అభివృద్ధిపై భక్తుల్లో ఆశలు
- అపరిష్కృతంగా 'ఐదు' పంచాయతీల విలీనం
- ఉమ్మడి జిల్లాలో పలు అభివృద్ధి పనులకు నిధుల సమస్య



ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తోపాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పలువురు రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సోమవారం పర్యటనకు వస్తుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనపై జిల్లా ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు. సీఎంగా భద్రాచలం పర్యటనలో జిల్లాకు నిధులు కేటాయింపు, సమస్యల పరిష్కారానికి ఎలాంటి వరాలు ప్రకటిస్తారని సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఇటు భద్రాచల పుణ్యక్షేత్ర అభివృద్ధికి, పర్యాటక అభివృద్ధికి గోదావరి ఘాట్‌తోపాటు పర్యాటకులను ఆకట్టుకునే రీతిలో పలు నిర్మాణాలకు, భద్రాచలానికి రైల్వేలైన్ ఏర్పాటుకు నిధులు అవసరం ఉంది. పాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వేట్రాక్ నిర్మించాలి. దీనిపై సీఎం తీసుకునే నిర్ణయం బట్టి నిధులు కేటాయింపు జరగనుంది. అలాగే గోదావరి నదిని కూడా గంగానది వలే జలకాలుష్య నివారణ ప్రాజెక్టు కింద అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. గోదావరి నది అపరిశుభ్రం కాకుండా చర్యలు చేపట్టాలి.

అపరిష్కృతంగా 'ఐదు' పంచాయతీల విలీనం

భద్రాచలాన్ని ఆనుకొని ఉన్న యాటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం పంచాయతీలు ఆంధ్రా నుంచి తెలంగాణలో విలీనం కావాల్సిన అవసరం ఉంది. భద్రాచలం రాముని భూములు కూడా ఆంధ్రాలోకి వెళ్లడం ద్వారా ఆక్రమణకు గురవుతున్నాయి.

సీతమ్మసాగర్ బ్యారేజీకి నిధుల అవసరం..

అలాగే గోదావరిపై నిర్మిస్తున్న సీతమ్మసాగర్ బ్యారేజీకి సీతారామ ఎత్తిపోతల పథకానికి సైతం సుమారు రూ.8,500 కోట్ల నిధులు అవసరం ఉంది. ఇప్పటి వరకు 50 శాతం పనులయ్యాయి. ఇంకా 50శాతం పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈనిధులు కేటాయిస్తేనే గోదావరి జలాలు పాలేరుకు అనుసంధానం జరిగి ఉమ్మడి జిల్లాలో పది లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. అలాగే జిల్లాలో మరికొన్ని సాగునీటి ప్రాజెక్టులు కూడా పెండింగ్‌లో ఉన్నాయి.

నిర్మాణ దశలోనే మెడికల్ కాలేజీ

గతేడాది మంజూరైన కొత్తగూడెం ఖమ్మం మెడికల్ కాలేజీలకు పూర్తిస్థాయి భవన నిర్మాణాలకు నిధులు కేటాయింపు అవసరం ఉంది. కొత్తగూడెంలో భవన నిర్మాణాలు జరుగుతున్నా ఖమ్మంలో తాత్కాలిక వసతులతోనే నడుస్తుంది. ఖమ్మం మెడికల్ కాలేజీకి వంద కోట్ల నిధులు అవసరం ఉంది. అలాగే ఖమ్మం జిల్లాకు మంజూరైన జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజీ, పాలేరు నియోజకవర్గంలోని మద్దులపల్లి ఐటీడీఏ ట్రైనింగ్ సెంటర్ భవనంలో తాత్కాలికంగా ఏర్పాటు చేశారు. దీనికి ఇటీవలే 30 ఎకరాల భూమి కేటాయించారు. జేఎన్‌టీయూ కాలేజీకి పూర్తి భవనాలు నిర్మించాలంటే రూ.300కోట్ల నిధులు అవసరం ఉంది.

విశ్వవిద్యాలయం ఏర్పాటుకు డిమాండ్..

తెలంగాణలో ఉమ్మడి జిల్లాలో గతంలో యూనివర్సిటీలు మంజూరు చేశారు. ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో మాత్రమే యూనివర్శిటీలు నెలకొల్పలేదు. ఖమ్మం కేంద్రంగా యూనివర్శిటీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉంది. అన్నీ పండ్ల తోటలకు నిలయంగా ఉన్న అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలను హార్టికల్చర్ యూనివర్సిటీగా మార్పు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చేయాలంటే దానికి మాస్టర్ ప్లాన్, నిధులు అవసరం ఉంది. ఖమ్మంలో వెలిసి ఉన్న స్తంబాద్రి లక్ష్మీనర్సింహాస్వామి ఆలయ అభివృద్ధికి కూడా నిధులు అవసరం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఎన్నో పర్యాటక ప్రదేశాలు, పురాతన ఆలయాల అభివృద్ధికి కూడా ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయి. సీఎం ప్రత్యేక చొరవ తీసుకుని ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ సమస్యలపై దృష్టి పెట్టి నిధులు కేటాయిస్తే జిల్లాలో గోదావరి, కృష్ణా జలాలతో సస్యశ్యామలం కావడంతో పాటు అనేక వ్యవసాయ పంటల సాగు పెరగనుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లా అభివృద్ధికి తీసుకునే నిర్ణయాలు, కేటాయించే నిధులు బట్టి ఉమ్మడి జిల్లా ప్రగతి ముడిపడి ఉంది.

ఉద్యోగులకు ఏడో గ్యారెంటీ!

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగుల డీఏ, పీఆర్సీపై త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆదివారం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ఎంసీహెచ్ఆర్డీలో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇన్ని రోజులూ ఆయా ప్రభుత్వ ఉద్యోగ సంఘాలకు గౌరవ అధ్యక్షులుగా ఉన్నది కేసీఆర్ కుటుంబమేనన్నారు. నిర్బంధాలతో పాలన సాగిస్తామనుకోవడం వారి భ్రమ అని, సమస్యలకు చర్చలే పరిష్కారం తప్ప.. నిర్బంధాలు కావని అన్నారు. ప్రభుత్వంపై ఉద్యోగులకు విశ్వాసం కల్పించడానికే చర్చలు జరుపుతున్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ఇప్పటికే మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించామని గుర్తు చేశారు. మంత్రివర్గ ఉపసంఘం శాఖలవారీగా సమావేశం నిర్వహించి నిర్ణయాలు తీసుకుంటుందని, సంఘాలతో చర్చించకుండా నిర్ణయాలు తీసుకోబోమని స్పష్టం చేశారు. ఉద్యోగుల డీఏతో పాటు ఇతర అంశాలపై మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, వివిధ శాఖల్లో ఉన్న 1100 మంది రిటైర్డ్ ఉద్యోగుల కొనసాగింపుపైనా త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీలకు ఉచితంగా విద్యుత్తు ఇచ్చే విషయంలోనూ క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కిందిస్థాయి సిబ్బందిని నియమిస్తామని చెప్పారు. ఉద్యోగులకు ఒకటో తారీకునే జీతాలు వేసినా తాము ప్రచారం చేసుకోవడం లేదన్నారు. రోజుకు 18 గంటలు పనిచేస్తూ పాలనను గాడిలో పెడుతున్నామని చెప్పారు.

తెలంగాణ బాపు కేసీఆర్ కాదు..

మాజీ సీఎం కేసీఆర్ తనకు తాను తెలంగాణ బాపుగా చెప్పుకొంటున్నారని, అలా చెప్పుకోవడానికి కనీస పోలిక ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తెలంగాణ బాపు, సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ అని, తెలంగాణ ఆత్మను గౌరవించకపోతే సమాజం మనల్ని క్షమించదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో ఆదాయం పడిపోతే.. మద్యంపై వచ్చే ఆదాయంపైనే ఆధారపడేలా కేసీఆర్ పాలన సాగిందని విమర్శించారు. విద్యార్థి, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల పోరాటంతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందరి రేవంత్ అన్నారు. రక్తం చిందించకుండా తెలంగాణ సాధించామని కేసీఆర్ పచ్చి అబద్ధాలు మాట్లాడారని విమర్శించారు. కేసీఆర్ కుటుంబంలో ఎవరి రక్తమూ చిందలేదని, కానీ.. కానిస్టేబుల్ కిష్టయ్య లాంటివారు రక్తాన్ని చిందించారని, శ్రీకాంతాచారి లాంటివారు మాంసపు ముద్దలయ్యారని అన్నారు. టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్‌ను శాసన మండలికి తప్పక పంపుతామని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆయన ఎమ్మెల్సీగా ఉంటే శాసనమండలికి గౌరవమన్నారు. ఈ విషయంపై గవర్నర్ తమిళిసైతో మాట్లాడతానన్నారు. ఈ సమావేశంలో మంత్రి డి.శ్రీధర్‌బాబు, కోదండరామ్, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



టీచర్లు, ఉద్యోగులలో సంతోషం..

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో పదేళ్ల తర్వాత ముఖ్యమంత్రి ముఖాముఖి సమావేశం కావడం పట్ల ఆయా సంఘాలు సంతోషం వ్యక్తం చేశాయి. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు ప్రత్యేక చొరవతో ఏర్పాటైన ఈ సమావేశంలో.. ప్రధాన డిమాండ్లను సీఎం దృష్టికి టీజీవోఏ తీసుకెళ్లింది. ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏల్లో మూడింటిని ఇవ్వాలని, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరింది. వీటితోపాటు పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న హెల్త్ కార్డులను వెంటనే ఇవ్వాలని, పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలని విన్నవించింది. కాగా, ముఖ్యమంత్రి రెండు గంటలపాటు తమ సమస్యలపై మాట్లాడమే కాకుండా ఎంతో ఓపికగా విన్నారని సంఘాల నేతలు తెలిపారు. గతంలో కనీసం సమస్యలు వినే పరిస్థితి కూడా ఉండేది కాదన్నారు. కాగా, వైద్యశాఖలో పని చేస్తున్న మెడికల్ సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ అందరినీ బదిలీ చేయాలని మెడికల్ జేఏసీ.. ముఖ్యమంత్రిని కోరింది. ఉస్మానియాకు కొత్త భవనం కట్టాలని, అశాస్త్రీయంగా ఉన్న మెడికల్ కాలేజీల సంఖ్యను తగ్గించాలని సూచించింది. ఆస్పత్రుల్లో విధులకు వచ్చే నర్సులు దుస్తులు మార్చుకునేందుకు కనీసం రూమ్‌లు లేని విషయాన్ని నర్సుల అసోసియేషన్ సీఎం దృష్టికి తీసుకెళ్లింది. ఇక సాధారణ బదిలీలు, పదోన్నతులు, 317 సమస్యను పరిష్కరించాలని, ఉపాధ్యాయ, ఉద్యోగుల సీపీఎస్ రద్దు, పాత పెన్షన్ పునరుద్ధరణపై ఆయా సంఘాల ప్రతినిధులు సీఎంకు వినతి పత్రం ఇచ్చారు. ప్రధానంగా టీచర్లకు సంబంధించిన మల్టీజోన్, స్పౌజ్ సమస్యలు, స్థానికత, బదిలీలు, ఆరోగ్య బీమా, పెండింగ్ డీఏ లాంటి సమస్యలను వివరించారు. కాగా వినతి పత్రాలను కొన్నింటిని సీఎం నేరుగా తీసుకున్నారు.

సీఎంకు పీఆర్‌టీయూ నేతల కృతజ్ఞతలు

ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం నిర్వహించడమే కాకుండా సమస్యల్ని త్వరలోనే పరిష్కరిస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇవ్వడం పట్ల పీఆర్‌టీయూ నేతలు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, కమలాకర్‌రావు కృతజ్ఞతలు తెలిపారు.

అధికారంలోకి వచ్చిన 72 రోజులకే 31వేల ఉద్యోగాలిచ్చాం

మరో గ్యారెంటీకి శ్రీకారం: పొంగులేటి


మాటిస్తే కాంగ్రెస్ మడమ తిప్పదు: సురేఖ

జీవో 3పై కవిత వ్యాఖ్య విడ్డూరం: సీతక్క

వరంగల్, మార్చి 10(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తాము అధికారంలోకి వచ్చిన 72 రోజుల్లోనే 32వేల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసి, యుద్ధప్రతిపాదికన ఉద్యోగ నోటిఫికేషన్లు ఇస్తున్నామని చెప్పారు. గత ప్రభుత్వం నిరుద్యోగ యువత ఉసురు తీసుకుందని, తాము 11,600 టీచర్ ఉద్యోగాల భర్తీకి మెగా డీఎస్సీ కోసం నోటిఫికేషన్ ఇచ్చామని పేర్కొన్నారు. ఆదివారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో రూ.68 కోట్లతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు, వరంగల్ నగరంలో రూ.280.85 కోట్లతో చేపట్టిన పనులకు మంత్రులు కొండా సురేఖ, సీతక్కతో కలిసి ఆయన ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమాల్లో మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఇప్పటికే నాలుగు పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని తెలిపారు. అర్హులైన పేదలందరికీ సొంతింటి కలను సాకారం చేస్తామని తెలిపారు. ఒకటో తేదీ నుంచి మూడో తేదీలోపు ఉద్యోగులకు వేతనాలు ఇస్తున్న ప్రభుత్వం తమదని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట తప్పదని మంత్రి కొండా సురేఖ అన్నారు. అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, అందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్ నగరానికి రూ.260కోట్ల నిధులు కేటాయించారని తెలిపారు. జీవో నంబరు 3కు వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కవిత మాట్లాడడం విడ్డూరమని, అసలు ఆ జీవో ఇచ్చిందే కేసీఆర్ ప్రభుత్వమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. తప్పుడు ప్రచారాలు బంద్ చేసి, నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించారు.

సీతారామ నీరివ్వండి..

- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్


కలెక్టర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, మార్చి 10: సాధ్యమైనంత తొందరగా వైరా రిజర్వాయర్‌కు సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకురావాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్‌కు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చింతకాని మండల పర్యటనలో పాల్గొన్న రాందాస్‌నాయక్ కలెక్టర్ గౌతమ్‌తో వైరాకు సీతారామ ప్రాజెక్టు నీటిని తీసుకువచ్చే విషయమై చర్చించారు. సీతారామ నీటిని తీసుకురావడానికి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్‌ను ఎమ్మెల్యే కోరారు. సీతారామ ప్రాజెక్టు మొత్తం పూర్తికావటానికి కొన్ని సంవత్సరాలు పడుతుందని అయితే ఉన్న ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా కొన్నినెలల వ్యవధిలోనే ఆనీటిని వైరాకు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. మిషన్ భగీరథ తాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్‌లో నీటినిల్వ ఉంచాల్సి రావడంతో పంటల సాగుకు నీరు విడుదల చేయలేని పరిస్థితి నెలకొందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతిరోజూ సాగునీటి కోసం ఆయకట్టు రైతులు తనపై తీవ్ర వత్తిడి తీసుకువస్తున్నారని కలెక్టర్‌కు ఎమ్మెల్యే వివరించారు.

పట్టపగలే చినబండిరేవులో చోరీ

దుమ్ముగూడెం, మార్చి 10: మండల పరిధిలోని చినబండిరేవులో యలగందుల సత్యనారాయణ ఇంట్లో పట్టపగలే రూ. లక్ష విలువగల బంగారాన్ని గుర్తు తెలియని వ్యక్తులు అపహరించారు. సత్యనారాయణ కుటుంబం వ్యవసాయ పనుల కోసం పొలానికి వెళ్లిన సమయంలో చుట్టు గుడిశె వెనుక భాగం నుంచి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు బీరువాలో దాచి ఉంచిన బంగారాన్ని అపహరించారు. దొంగతనం విషయం తెలవడంతో సత్యనారాయణ భార్య స్పృహ తప్పి పడిపోగా, ఆమెను వైద్యచికిత్సల కోసం తరలించారు. కాగా సుమారు ఐదు రోజుల క్రితం సత్యనారాయణ సోదరుడి ఇంట్లో సైతం రూ.30వేల నగదు చోరీకి గురైంది. బాధితుడు సత్యనారాయణ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

భట్టి నాకు ద్రోహం చేస్తున్నారు

- ఖమ్మం టికెట్‌ను అడ్డుకుంటున్నారు: వీహెచ్

న్యూఢిల్లీ, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తనకు ద్రోహం చేస్తున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఖమ్మం లోక్‌సభ సీటు తనకు రాకుండా భట్టి అడ్డుకుంటున్నారని ఆరోపించారు. ఆదివారం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో విలేకరుల సమావేశంలో వీహెచ్ మాట్లాడారు. 'భట్టిని అప్పట్లో ఎమ్మెల్సీని చేయడంలో నాదే కీలక పాత్ర.. భట్టి ఈరోజు పార్టీలో ఈస్థానంలో ఉండడానికి కారణం నేనే.. 2019 వరకు ఖమ్మంలో ప్రతి కార్యక్రమానికి ఆయన నన్ను రమ్మన్నారు.. ఆ తర్వాత పిలవడం మానేశారు. పనిచేసినోడికి ముఖ్యమంత్రి పదవి రావాలని నేను అన్నందుకే నాపై కక్ష కట్టారు' అని ఆవేదన వ్యక్తం చేశారు. రేవంత్ పార్టీ కోసం చాలా కష్టపడ్డారని చెప్పారు. 'రాహుల్‌ఖమ్మం నుంచి పోటీ చేస్తే నేను తప్పుకుంటా.. లేదంటే ఆ సీటుకు నేను అన్నివిధాల అర్హుడిని.. ఖమ్మం టికెట్ ఇస్తే భారీ మెజారిటీతో గెలుస్తా.. పదవి ఉన్నా లేకపోయినా చనిపోయేవరకు కాంగ్రెస్‌లోనే ఉంటా.. చనిపోయిన తర్వాత పార్టీ జెండా నాపై ఉంటుంది' అని వ్యాఖ్యానించారు.

వీహెచ్‌కు ఖమ్మం టికెటిస్తే కలిసికట్టుగా గెలిపిస్తాం

- నేను అడ్డుపడడం..ఆయన అపోహ: భట్టి

చింతకాని, మార్చి 10: లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపికలో కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీదే తుది నిర్ణయమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఆ కమిటీ నిర్ణయం మేరకే అభ్యర్థుల ఎంపిక ఉంటుదని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలంలో పర్యటించిన భట్టి.. ఎంపీ టికెట్ల కేటాయింపు విషయమై పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు చేసిన వ్యాఖ్యలపై వివరణ ఇచ్చారు. పార్టీ అధిష్ఠానం వీహెచ్‌కు ఖమ్మం ఎంపీ టికెట్ ఇస్తే జిల్లా మంత్రులు, నాయకులు, కార్యకర్తలు.. అందరం కలసికట్టుగా పనిచేసి గెలిపించుకుంటామని చెప్పారు. ఖమ్మం ఎంపీ టికెట్ వీహెచ్‌కు రాకుండా తాను అడ్డుపడటం లేదని.. అది కేవలం ఆయన అపోహ మాత్రమేనన్నారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడిగా వీహెచ్‌కు తన పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటుతో పాటు రాహుల్ గాంధీని ప్రధానిని చేయడమే తమ తక్షణ కర్తవ్యమన్నారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక విషయంలో అధిష్ఠానం నిర్ణయానికి తామంతా కట్టుబడి ఉంటామని తెలిపారు.

మాకు న్యాయం చేయండి

- 317 జీవో వల్ల బాధితులుగా మారాం
- మంత్రి దామోదరను కలిసిన నర్సులు

గత సర్కారు హయాంలో విడుదల చేసిన జీవో నంబరు 317 వల్ల తాము బాధితులుగా మారామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ నర్సులు వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఆదివారం ఆయన నివాసంలో కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. గత ప్రభుత్వం నిరంకుశంగా జోనల్ వ్యవస్థను తీసుకొచ్చి తమ జీవితాలతో చెలగాటం ఆడుకుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 317జీవోపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించి, అందరికీ న్యాయం చేస్తామనిమంత్రి ఉద్యోగులకు భరోసానిచ్చారు.

పేదింటి పండుగ

నేడు 'ఇందిరమ్మ ఇల్లు' పథకం ప్రారంభించనున్న సీఎం రేవంత్

హైదరాబాద్, ఖమ్మం/భద్రాచలం, మార్చి 10(ఆంధ్రజ్యోతి): పేదవాడి సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. "ఇందిరమ్మ ఇల్లు" పథకం కార్యరూపం దాల్చనుంది. రాముల వారు కొలువైన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం భద్రాచలంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించనున్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ ప్రాంగణం దీనికి వేదిక కానుంది. ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఇందిరమ్మ ఇల్లు ఐదోది. అధికారంలోకి వచ్చాక మూడు నెలల్లో నాలుగు పథకాలను అమలు చేసింది. కాగా, ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించి మూడు నమూనాలను కూడా సోమవారం ప్రకటించనున్నారు. పథకం అమలుకు అవసరమైన మార్గదర్శకాలను సర్కారు సిద్ధం చేసింది. ఇల్లు లేని అర్హులైన పేదలందరికీ దశలవారీగా వర్తింపజేయనున్నారు. స్థలం ఉన్నవారికి రూ.5 లక్షలు, లేనివారికి స్థలం ఇచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేయనున్నారు. ఈ మొత్తాన్ని నాలుగు దశల్లో మంజూరు చేస్తారు. ఈ ఏడాదిలో నియోజకవర్గానికి 3,500 చొప్పున 119 నియోజకవర్గాలకు 4,16,500 ఇళ్లను మంజూరు చేయగా.. రిజర్వ్ కోటా (సీఎం, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పరిధి)లో మరో 33,500 కేటాయించారు. మొత్తంగా 4.50లక్షల ఇళ్లు మంజూరు కానున్నాయి. తొలి దశలో సొంత స్థలం ఉన్నవారికి అందనుండగా.. స్థలం లేనివారికి రెండో దశలో పథకాన్ని వర్తింపజేస్తారు. ఇంటి నిర్మాణం విషయంలో లబ్ధిదారుదే పూర్తి నిర్ణయం అయినప్పటికీ.. ఆర్‌సీసీ స్ట్రక్చర్‌తో పాటు కచ్చితంగా వంట గది, బాత్‌రూమ్ ఉండాలి. అనంతరం 'ఇందిరమ్మ ఇల్లు' పథకం కింద నిర్మించినదని తెలిసేలా 'అభయహస్తం' లేదా ప్రత్యేకంగా తయారు చేసే కొత్త లోగోను ఉంచనున్నారు. కాగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాల విషయంలో చేసిన తప్పులు ఈసారి జరగకుండా, అర్హులకే పథకం అందేలా మార్గదర్శకాలను ఖరారు చేశారు. ఈ పథకానికి అర్హులైన వారు దాదాపు 30-40 లక్షలమంది ఉండొచ్చని ప్రభుత్వం అంచనా వేస్తోంది. 'ప్రజాపాలన' దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తయ్యాక హెచ్చుతగ్గులు ఉండొచ్చని కూడా భావిస్తోంది. దరఖాస్తులన్నింటినీ క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు అవసరమైతే గ్రామసభల్లోనూ మరో సారి పరిశీలించనున్నారు. గ్రామ సభల్లో వివరాలను నమోదు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక ప్రొఫార్మాను రూపొందించింది.



పథకం కోసం రుణం..

ఇందిరమ్మ ఇల్లు పథకం కోసం రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రూ.3 వేల కోట్ల రుణం తీసుకోనుంది. ఎన్ని ఇళ్లను ఏయే దశల్లో నిర్మిస్తామనే వివరాలను కూడా తెలిపింది. తొలి శలో గ్రామీణ ప్రాంతాల్లో 57,141, పట్టణాల్లో 38,094 ఇళ్లను నిర్మిస్తామని పేర్కొంటూ ఈ నె 5న జీవో విడుదల చేసింది. దీని ప్రకారం నియోజకవర్గానికి 800 ఇళ్లు అందనున్నట్టు తెలుస్తోంది. ఈ గణాంకాలు, అంచనాలు హడ్కో రుణం కోసం సంబంధించినవేనని సమాచారం. వీటికి మరికొన్ని కలిపి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయనుంది. 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని మహిళ పేరు మీద అందిస్తారు. ప్రత్యేక పోర్టల్ ద్వారా నిర్మాణాలను పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుకి రేషన్ కార్డు కచ్చితంగా ఉండాలి. గతంలో ఇందిరమ్మ ఇల్లు పొంది ఉంటే అనర్హులు. మంజూరైన ఇళ్ల కంటే లబ్ధిదారులు ఎక్కువ ఉంటే.. వారికి మరో విడతలో అందిస్తారు.

సీఎం భద్రాచలం పర్యటన షెడ్యూల్ ఇది..

సీఎం రేవంత్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం 12:10 గంటలకు భద్రాచలం రాముడిని దర్శించుకోనున్నారు. 1:30కు వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటుచేసిన సభలో 'ఇందిరమ్మ ఇల్లు' పథకాన్ని ప్రారంభిస్తారు. 2:30 నుంచి 3:30 మధ్య భద్రాచలం ఆలయం, సాగునీటి, దేవాదాయ శాఖ అధికారులతో సమావేశమై సీతారామ, సీతమ్మసాగర్ ప్రాజెక్టుల పనుల పురోగతిపై సమీక్షిస్తారు. సాయంత్రం 4 గంటలకు మణుగూరులో సభకు హాజరవుతారు. 6:10 గంటలకు హైదరాబాద్‌కు తిరిగి చేరుకుంటారు.

భద్రాచలం రామాలయం అభివృద్ధిపై ఆశ

హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా భద్రాచలం వచ్చిన రేవంత్.. అధికారంలోకి వస్తే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సీఎం హోదాలో ఇప్పుడు భద్రాద్రి అభివృద్ధికి వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం భద్రాచలం అభివృద్ధికి రూ.100కోట్లు ప్రకటించినా రూపాయి ఇవ్వలేదు.

అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా హామీలు నెరవేరుస్తున్నాం: తుమ్మల




ఖమ్మంకార్పొరేషన్: ప్రజల సొమ్ము దోచుకోవటమే ధ్యేయంగా పనిచేసిన గత ప్రభుత్వం తమకు అప్పుల రాష్ట్రాన్ని అప్పగించినా సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో సాహసంతో ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా బూడిదెంపాడు వద్ద రూ.38.50 కోట్లతో ఖమ్మం-ఇల్లెందు రెండులైన్ల రహదారి నాలుగులైన్లుగా విస్తరణ, అభివృద్ధి పనులకు ఆదివారం మంత్రి శంకుస్థాపన చేశారు. సోమవారం భద్రాద్రి రాముడి సన్నిధిలో సీఎం రేవంత్‌రెడ్డి ఐదో గ్యారెంటీగా ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభిస్తారన్నారు. శ్రీశైలం, సాగర్‌లో నీళ్లు లేకపోవడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వ తప్పిదాలే కారణమన్నారు.

బడుల్లో మార్పు రావాల్సిందే!

- మౌలిక సదుపాయాలు కల్పించండి
- సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పూర్తి చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. పాఠశాలల్లో స్పష్టమైన మార్పు కనిపించాలని.. వాటిపై ప్రజలకు నమ్మకం కలిగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కారీ బడులు, కళాశాలలకు తక్షణమే ఉచిత విద్యుత్ అమలయ్యేలా చూడాలన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై ఆదివారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ఆయా శాఖల ఉన్నతాధికారులతో సీఎం సమీక్ష జరిపారు. విద్యార్థులకు యూనిఫామ్‌తో పాటు.. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల ఏర్పాటు, పర్యవేక్షణ బాధ్యతలను స్వయం సహాయక మహిళా సంఘాలకు అప్పగించే అంశాన్ని పరిశీలించాలన్నారు. ఇతర రాష్ట్రాల ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించి వాటిని రాష్ట్రంలో అమలు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసి.. టీ-శాట్ ద్వారా అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో డిజిటల్ పాఠాలు అందించాలని, బడులపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుపై దృష్టిసారించాలని, సీఎస్ఆర్ ఫండ్స్ కోసం ప్రయత్నం చేయాలని, సౌకర్యాలను మెరుగుపరచేందుకు ఎన్నారైల సహకారం తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచాలన్నారు. స్కిల్ యూనివర్సిటీ కోసం ఐఎస్‌బీ తరహాలో గవర్నింగ్ బాడీని ఏర్పాటు చేయాలన్నారు. న్యాక్‌పై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టాలన్నారు. సచివాలయం నుంచి కిందిస్థాయి వరకూ ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) తీసుకువచ్చే అంశంపై సీఎం చర్చించారు. సమీక్షలో మంత్రి శ్రీధర్‌బాబు, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, సీఎస్ శాంతికుమారి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి
6
సోమవారం 11 మార్చి 2024



మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై స్పష్టత ఇవ్వాలి

రాష్ట్ర అధ్యక్షుడు కొండా దేవయ్య పటేల్

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి10: మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటుపై వచ్చే పార్లమెంట్ ఎన్నికలలోపు స్పష్టత ఇవ్వాలని ఆ సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్య పటేల్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటును విస్మరించిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60లక్షల జనాభ కలిగిన మున్నూరుకాపులను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషిచేయాలన్నారు. ఈ సమావేశంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు పారా నాగేశ్వరరావు, మున్నూరుకాపు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రవిపటేల్, బండి సంజీవ్, కనిశెట్టి విజయ్‌కుమార్, జాబిశెట్టి శ్రీనివాసరావు, మదూరి పూర్ణచందర్‌రావు, పారా ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లోనే అభివృద్ధి పనులకు శ్రీకారం

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క
- బోనకల్, ముదిగొండ, చింతకానిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

బోనకల్,మార్చి10:అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని, దీంతో ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తోందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. బోనకల్ మండలంలో ఆదివారం ఆయన పర్యటించారు. దాదాపు రూ.16.50 కోట్ల నిధులతో చేపట్టనున్న రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయనకు పూల వర్షంతో ప్రజలు ఘన స్వాగతం పలికారు. బాణాసంచా కాల్చి, అభివృద్ధి ప్రదాత భట్టి జిందాబాద్ అన్న నినాదాలతో అభిమానాన్ని చాటుకున్నారు. మొదట ఎన్ఆర్ఈజీఎస్ ద్వార మంజూరైన రూ.20 లక్షలతో నిర్మించిన లక్ష్మీపురం పంచాయతీ కార్యాలయ భవనాన్ని విక్రమార్క ప్రారంభించారు.అనంతరం ఆళ్లపాడు నుంచి గోవిందాపురం (ఎ), గోవిందాపురం నుంచి మోటమర్రి, ఆళ్లపాడు నుంచి నారాయణపురం, కలకోట నుంచి నారాయణపురం వరకు గల రహదారులకు బీటీ వేసేందుకు శంకుస్థాపనలు చేశారు. ప్రజలు పలు సమస్యలపై వినతి పత్రాలను ఆయనకు అందజేశారు. గురుకులాల ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం ఇచ్చారు.



లక్ష్మీపురం పంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం భట్టి

ముదిగొండలో రూ.45.30కోట్లతో

ముదిగొండ: ముదిగొండ మండలంలో రూ.45.30కోట్ల బీటీ రోడ్ల నిర్మాణానికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదివారం శంకుస్థాపన చేశారు. మండలంలోని ముత్తారం, వనంవారిక్రిష్టాపురం గ్రామాల్లో పర్యటించి రహదారుల నిర్మాణానికి శంకుస్థాపనలు చేశారు. ముత్తారంలో జడ్పీ రోడ్డు నుంచి ముత్తారం వరకు రూ.2.30 కోట్లు, ముత్తారం నుంచి వల్లాపురం వరకు రూ.4కోట్లు, వనంవారిక్రిష్టాపురం అంబేద్కర్ విగ్రహం నుంచి సువర్ణాపురం క్రాస్‌రోడ్డు వరక రూ.4కోట్లు, గోకినపల్లి నుంచి చిరుమర్రి, వనంవారిక్రిష్టాపురం, జగన్నాథపురం వరకు రూ.35కోట్ల వ్యయంతో చేపట్టనున్న రహదారులకు భట్టి శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. మారుమూల ప్రాంతాలకు రోడ్ల నిర్మాణం పూర్తిచేసి రవాణా వ్యవస్థను మెరుగుపర్చటం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్, పంచాయతీరాజ్ ఎస్ఈలు శ్యాంప్రసాద్, చంద్రమౌళేశ్వరరావు, డీఈ కోటేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, ముదిగొండ సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, ఎంపీటీసీ సరస్వతీ, కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, కొమ్మినేని రమేష్ బాబు, రాయల నాగేశ్వరరావు, మాజీ జడ్పీటీసీలు మందడపు నాగేశ్వరరావు పసుపులేటి దేవేంద్రం, అజయ్, మార్క్స్, ఉసికల రమేష్, వీరబాబు, అజ్గర్ పాల్గొన్నారు.

పేద మహిళకు వైద్య ఖర్చులు మంజూరు

ఖమ్మంకార్పొరేషన్, మార్చి10: నగరంలోని 46వ డివిజన్‌కు చెందిన గవ్వల వీరమ్మ అనే పేద మహిళకు వైద్య ఖర్చులకు రూ.2.50లక్షల ముందస్తు నిధులను మంజూరు చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవ తీసుకోవడంతో ఈ నిధులు మంజూరయ్యాయి. ఈ పత్రాన్ని ఆదివారం మంత్రి తుమ్మల వీరమ్మకు అందించారు. వెన్నుపూస వ్యాధితో బాధపడుతున్న వీరమ్మ వైద్యం చేయించుకుఒలేని పరిస్థితిలో ఉండగా స్థానిక కాంగ్రెస్ నాయకుడు బాణాల లక్ష్మణ్ సమస్యను మంత్రి తుమ్మల దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్పందించి వెంటనే శస్త్రచికిత్సకు సీఎంఆర్ఎఫ్ ద్వారా ముందస్తు ఖర్చుల నిమిత్తం నిధులు మంజూరు చేయించి ఎల్‌వోసీని అందించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సాధు రమేష్‌రెడ్డి, బీరేష్, నాగేశ్వరరావు, రామకృష్ణ, రవీందర్ పాల్గొన్నారు.



ఎల్‌వోసీ పత్రాన్ని అందిస్తున్న మంత్రి తుమ్మల

మంత్రి తుమ్మల చొరవతో తాగునీటి సమస్య పరిష్కారం

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతోనే ఖమ్మం నగరంలో తాగునీటి సమస్య పరిష్కారం అయిందని 44వ డివిజన్ కార్పొరేటర్ పాలెపు విజయవెంకటరమణ పేర్కొన్నారు. నగరవాసుల దాహార్తిని తీర్చేందుకు పాలేరు నుంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని మంత్రి తుమ్మల అధికారులను ఆదేశించిన నేపథ్యంలో ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతూ డివిజన్ పరిధిలోని పాత రైతుమార్కెట్ ప్రాంతంలో ఆదివారం కార్పొరేటర్ ఆధ్వర్యంలో తుమ్మల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నగరంలో నీటి ఎద్దడి నెలకొన్న తరుణంలో తుమ్మల అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి, సమస్యను పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు షేక్‌జానీ, ఖలీల్, సతీష్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు వెంకట్రావు, షకీల్,రమేష్, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలి

కూసుమంచి, మార్చి 10: పాలేరు జలాశయం పరిధిలోని మత్స్యకారుల సమస్యలు పరిష్కరించాలని బీజేపీ ఖమ్మం పార్లమెంటు నాయకులు తాండ్ర వినోద్‌రావు తెలిపారు. ఆదివారం పాలేరులో మత్స్యకారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చావా కిరణ్, నున్నా రవికుమార్, దాసరి వెంకటేశ్వర్లు, గడ్డం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు రూ.3లక్షల కోట్లు కేటాయించాలి

సత్తుపల్లిరూరల్, మార్చి10: నిరుపేదల కోసం ప్రవేశపెట్టిన ఉపాధి హామీ పథకానికి రూ.3లక్షల కోట్లు కేటాయించాలని టీకేఎంయూ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కిష్టాపురంలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. కార్యక్రమంలో హసావత్ అలివేలు, కుజుసోతు వెంకమ్మ, శంకర్, సునీత, రమణ, వెంకమ్మ, సత్యావతి, రాములమ్మ పాల్గొన్నారు.

మెనూ ఛార్జీలు పెంచాలి

సత్తుపల్లిరూరల్,మార్చి10: మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు 1వ తేదీనే వేతనాలు ఇస్తూ పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు పెంచాలని ఆసంఘ రాష్ట్ర నాయకులు నిమ్మటూరి రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం సత్తుపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో తెలగారపు రామారావు, మహదేవలక్ష్మీ, కుంటా వెంకమ్మ, షేక్ రహీమున్నీసా, వెంకటలక్ష్మీ, జయమ్మ, పీ.సత్యావతి, వెంకటమ్మ, రాఘవమ్మ, భారతి, అనసూర్య, రాజ్యలక్ష్మీ, విజయలక్ష్మీ, కృష్ణవేణి పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మేవారిపై చర్యలు తీసుకోవాలి

ఏన్కూరు, మార్చి 10: నకిలీ, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అమ్ముతూ రైతులను మోసం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి జాగర్లముడి రంజిత్‌కుమార్ కోరారు. ఆదివారం ఏన్కూరులో కార్యకర్తల సమావేశం జరిగింది. గార్లొడ్డు రైతుల ఆందోళనపై సమగ్ర విచారణ జరిపి వారికి న్యాయం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో పార్టీ జిల్లా సమితి సభ్యులు తెప్పల సత్యం, అమరనేని వీరభద్రం, మేడ భూషయ్య, మంకెన కృష్ణ, మాదినేని వెంకన్న పాల్గొన్నారు.

యుగంధర్‌ను కలిసిన ఆటో యూనియన్ నాయకులు

ఖమ్మంచర్చికాంపౌండ్,మార్చి10: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో డ్రైవర్లు ఆదివారం ఖమ్మంలోని మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో తుమ్మల యుగంధర్‌ను కలిశారు. మంత్రి తుమ్మలతో చర్చించి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు.

సావిత్రిబాయి పూలే వర్ధంతి

ఖమ్మంచర్చికాంపౌండ్, మార్చి10: సావిత్రిబాయి పూలే వర్ధంతిని పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు కోడూరి సీతామహాలక్ష్మి తదితరులు సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీనివాసరావు తెలుగు సాహిత్యానికి గర్వకారణం

ఖమ్మంసాంస్కృతికం, మార్చి10: ప్రముఖకవి మువ్వా శ్రీనివాసరావు తెలుగు సాహిత్యానికి గర్వకారణమని పలువురు సాహితీవేత్తలు కొనియాడారు. ఆదివారం ఆయన పుట్టిన రోజు, వివాహదినోత్సవం సందర్భంగా ఖమ్మంలోని ఒక హోటల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో కవులు, చయితలు పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో జాషువా సాహిత్యవేదిక బాధ్యులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు, కన్నెగంటి వెంకటయ్య, మేడగాని శేషగిరి, కొండ్రు బ్రహ్మం, నామా పురుషోత్తం, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడిపై దాడి

ఖమ్మం రూరల్; మార్చి 10:మద్యం మత్తులో ఇద్దరు యువకులు ఘర్షణ పడి ఓ యువకుడిపై మరో యువకుడు గాజు పెంకుతో దాడి చేశాడు. తీర్థాల జాతరలో ఆదివారం చోటు చేసుకుంది. ఖమ్మం పట్టణంలోని రమణగుట్ట ప్రాంతానికి చెందిన అర్జు, మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన రాజేష్ ఇద్దరు మద్యం మత్తులో ఘర్షణపడ్డారు. దీంతో రాజేష్ గాజు పెంకుతీసుకుని అర్జుని పొట్ట లో పొడిచాడు. గాయపడ్డ వ్యక్తిని 108 ద్వారా చికిత్స నిమిత్తం పోలీసులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

ఖమ్మంరూరల్, మార్చి10: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల పరిధిలోని వరంగల్‌క్రాస్ రోడ్డుకు చెందిన ఇద్దరు మృతి చెందారు. వరంగల్ క్రాస్ రోడ్డుకు చెందిన షబ్బీర్ (36), రాజిరెడ్డి (37) గ్రానైట్ రాళ్ల వ్యాపారం చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో గ్రానైట్ రాళ్లు కొనుగోలు చేసి లారీలో లోడ్ చేసుకుని ఖమ్మం బయలుదేరారు. మార్గమధ్యలో లారీ అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పెద్ద బండరాయిని ఢీ కొంది. గ్రానైట్ రాయి క్యాబిన్‌పైకి దూసుకువచ్చింది. లారీ క్యాబిన్‌లో ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మూడోరోజు కొనసాగిన తీర్థాల జాతర





తీర్థాలలో భక్తుల సందడి, కోటిలింగాలలో మొక్కులు చెల్లించుకున్న కారేపల్లి టీడీపీ నాయకులు

ఖమ్మంరూరల్,మార్చి10: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని తీర్థాల సంఘమేశ్వరాలయంలో నిర్వహిస్తున్న జాతర ఆదివారం మూడోరోజు కొనసాగింది. భక్తులు త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ తగ్గడంతో క్యూలైన్లు లేకుండానే భక్తులు స్వయంగా ఆలయంలోకి వెళ్లి స్వామిని దర్శించుకున్నారు. ఆదివారం సెలవు కావడంతో భక్తులు భారీగా వచ్చారు. అన్ని శాఖల అధికారుల పర్యవేక్షణలో జాతర కొనసాగింది.

జాతరలో పాల్గొన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా:వైరామండలం స్నానాల లక్ష్మీపురంలో జరిగిన జాతరలో శనివారంరాత్రి వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ పాల్గొన్నారు. మిఠాయిదుకాణంలో మిఠాయి కొనుగోలు చేసి రుచి చూశారు. ఆలయ కమిటీ నిర్వహించిన మ్యూజికల్‌నైట్ కార్యక్రమాన్ని తిలకించారు. జాతరలో కలియ తిరిగి భక్తులను కలుసుకున్నారు. కార్యక్ర మంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, టీపీసీసీ కార్యదర్శి నూతి సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, దొడ్డా పుల్లయ్య, పమ్మి అశోక్, మల్లు రామకృష్ణ, స్వర్ణ నరేందర్, భువనేశ్వర్‌రాజు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న టీడీపీ నాయకులు

కారేపల్లి: మండలపరిధిలోని ఉసిరికాయలపల్లిలోని కోటమైసమ్మతల్లి ఆలయంలో ఆదివారం మండల టీడీపీ ఆధ్వర్యంలో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఇటీవల ఎన్నికల్లో మాలోత్ రాందాసు నాయక్ ఎమ్మెల్యేగా గెలుపొందితే అమ్మవారికి మొక్కులు చెల్లించుకుంటామని మండల కమిటీ నాయకులు మొక్కుకున్నారు. రాందాసు నాయక్ గెలుపొందడంతో ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్ష కార్యదర్శులు పోలూరిరామారావు, బోడ మంగీలాల్, మైనార్టీ సంఘం అధ్యక్షులు ఎండి. యాకుబ్, రైతు సంఘం మండల అధ్యకులు దుదిపాళ్ళ బాస్కరావు, కంచిరమేష్, తాళారి సారయ్య, చిన్న శ్రీనివాస్, ఎన్కూరు మండల ఎంపీపీ వరలక్ష్మీ, రామారావు పాల్గొన్నారు.

ముగిసిన కోటిలింగాల జాతర

కారేపల్లి: మండల పరిధిలోని పోలంపల్లి గ్రామంలో గల కోటిలింగాల జాతర ఆదివారంతో ముగిసింది. మొత్తంమీద జాతరకు లక్షమందికి పైగా భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు చేసి స్వామి వారిని దర్శించుకున్నారు. జాతరలో పోలీసులు బందో బస్తు నిర్వహించారు.

ప్రభుత్వ విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వం

ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యుడు ఇటికాల

ఖమ్మంసంక్షేమవిభాగం, మార్చి10: దేశంలో నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వ విద్యారంగాన్ని కేంద్ర ప్రభుత్వం దెబ్బతీస్తోందని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు ఇటికాల రామకృష్ణ విమర్శించారు. ఆదివారం గిరిప్రసాద్ భవన్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ విద్యారంగంలో కార్పొరేటీకరణతో పాటుగా కషాయికరణ దిశగా బీజేపీ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆరోపించారు. నాయకులు మడుపల్లి లక్ష్మణ్ నాగుల్‌మీరా, కౌశిక్, రాకేష్, ప్రతాప్, నాగేందర్, సతీష్ పాల్గొన్నారు.

షిర్డీసాయి మందిర వార్షికోత్సవం

నేలకొండపల్లి,మార్చి10:మండల పరిధిలోని మూటాపురం గ్రామంలోని షిర్డీసాయి మందిరం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. బాబాకు కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకములు నిర్వహించారు. సామూహిక సాయివ్రతాలు జరిపించారు. సాయి భజన గీతాలు ఆలపించారు. షిర్డీసాయి తత్వ బోధామృతం పుస్తకముల నుంచి సత్సంగ ప్రసంగాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



మూటాపురంలో వేడుకలు

గ్రామీణ యువత అన్ని క్రీడల్లో రాణించాలి

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, మల్లు నందిని



ఫైనల్ పోటీను ప్రారంభిస్తున్న మల్లు నందిని

చింతకాని,ఫిబ్రవరి22: గ్రామీణ యువత అన్ని క్రీడల్లో రాణించాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని అన్నారు. ఆదివారం మండల పరిధిలోని నేరడ గ్రామంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రాల స్థాయి కబడ్డీ పోటీల బహుమతుల ప్రదానోత్సవానికి కూనంనేని హాజరయ్యారు. గ్రామీణ క్రీడలు అంతరించిపోతున్న తరుణంలో నేతాజీ యువజన సంఘం ఏటా కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతీక్రీడాకారుడు క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలన్నారు. దాదాపు 43ఏళ్ల నుంచి క్రీడా పోటీలు నిర్వహిస్తున్న నేతాజీ యువజన సంఘాన్ని ఆయన అభినందించారు. అంతకు ముందు ఫైనల్ కబడ్డీ పోటీను ఉప ముఖ్యమంత్రి సతీమణి మల్లు నందిని, కుమారుడు సూర్య విక్రమాదిత్య ప్రారంభించారు. ఫైనల్ పోటీ పూర్తయ్యే వరకు ఆసక్తిగా తిలకించారు. పోటీలలో మొదటి బహుమతి ఖమ్మం అకాడమీ, రెండో బహుమతి గుంటూరు టీంలు విజయం సాధించాయి. కార్యక్రమంలో నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు దూసరి నేతాజీ, సీపీఐ నాయకులు జమ్ముల జితెందర్‌రెడ్డి, మడిపల్లి భాస్కర్, పావులూరి మల్లికార్జున్, దూసరి గోపాలరావు, గోగుల ఆది, పెరిక ప్రభాకర్ తదితరలు పాల్గొన్నారు.

ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలి

రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ఖమ్మం సంక్షేమవిభాగం, మార్చి 10: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో సోమవారం నిర్వహించే ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం మంత్రి పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఇందిరమ్మ ఇళ్ల పథకంతో పాటుగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రారంభిస్తారని పొంగులేటి వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ శ్రేణులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రజాదీవెన సభను విజయవంతం చేయాలని కోరారు.

శ్రీవారి బ్రహ్మోత్సవం ప్రారంభం

తల్లాడ, మార్చి10: తల్లాడలోని హనుమత్ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఆదివారం శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు దివి సీతారామాచార్యుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ గుర్రం శేషగిరిరావు పాల్గొన్నారు.

చర్చిలో రక్తదాన శిబిరం



రక్తదాతను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

సత్తుపల్లి, మార్చి10: సత్తుపల్లి మునిసిపాలిటీలోని మౌంట్ కార్మెల్ చర్చి (జ్యోతినిలయం స్కూల్) సత్తుపల్లి విచారణ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే మట్టా రాగమయి ఆదివారం ప్రారంభించారు. 63 మంది రక్తదానం చేయగా మెగా వైద్య శిబిరంలో 512 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కొత్తగూడెం ఓసీడీ ప్రొవిన్షియల్ సుపీరియర్ అమృతరాజ్, విజయభాస్కర్ (విన్సెంట్), కృపా, జ్ఞానేష్, సంకల్ప స్వచ్ఛంద సేవాసంస్థ నిర్వాహకులు పీ.అనిత, సిస్టర్స్ పాల్గొన్నారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మండలంలోని కిష్టాపురానికి చెందిన జల్లి మీక్షానికి సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2లక్షల ఎల్‌వోసీని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మట్టా దయానంద్ విజయకుమార్ ఉన్నారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

కామేపల్లి, మార్చి 10: మండల పరిధిలోని బాసిత్‌నగర్ హైస్కూల్ పదోతరగతి విద్యార్థులకు బాసిత్‌నగర్ ఎంప్లాయిస్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని ఆదివారం అందజేశారు. ఉన్నతలక్ష్యంలో ముందుకెళ్లాలని దాత బాదావత్ రాందాస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వీర్య, అధ్యక్షుడు గిరిదర్, ప్రధాన కార్యదర్శి బాదావత్ శ్రీను, గ్రామ పెద్దలు నూనావత్ సూర్య, బానోత్ రాందాస్, శ్రీను, బాలాజీ, నరేందర్ పాల్గొన్నారు.

అమర వీరుల ఆశయాలు సాధించాలి

తిరుమలాయపాలెం, మార్చి10: ప్రజాసమస్యల పరిష్కారానికి అసువులు బాసిన అమరవీరుల ఆశయాలు సాధించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా నాయకులు తిమ్మిడి హనుమంతరావు తెలిపారు. ఆదివారం మండలంలోని తెట్టెలపాడు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ పుసులూరి రామయ్య వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి ఎస్.వెంకటేశ్వర్లు, పుసులూరి పుల్లయ్య, పుసులూరి గిరి పాల్గొన్నారు.

రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సైకిళ్ల పంపిణీ



సైకిళ్లు అందిస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

కల్లూరు, మార్చి10:మండలంలోని చెన్నూరులో ఆదివారం రోటరీక్లబ్ ఆఫ్ చేంజ్ మేకర్స్ హైదరాబాద్ ఆధ్వర్యంలో రూ.40వేల సైకిళ్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ ఆఫ్ చేంజ్ మేకర్స్ అధ్యక్షుడు కే వెంకటేష్, కార్యదర్శి సుమన్‌లు వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమానికి క్లబ్ మాజీఅధ్యక్షుడు మాదాల వంశీ అధ్యక్షత వహించారు. భవిష్యత్తులో చెన్నూరును దత్తతతీసుకొని సేవ కార్యక్రమాలు చేపడు తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామప్రముఖులు పసు మర్తి మోహన్ రావు, మాదాల వెంకటేశ్వరరావు, జి ఉపేంద్ర, నలజాల మంగపతి, మాదాల నారాయణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చంద్రుపట్ల ఉన్నత పాఠశాలలో వేడుక

కల్లూరు, మార్చి10: మండలంలోని చంద్రుపట్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆది వారం పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆ పాఠశాలలో 2008-09లో పదోతరగతి చదిన విద్యార్థులు ఈ సమ్మేళనం నిర్వహించారు. నాటి గురువులు కే.కిషోర్ బాబు, కావేటి మోహనరావు, లక్కినేని కృష్ణ మోహన్, ఎం.నరిసింహారావు, రికార్డ్ అసిస్టెంట్ ఎండి మగ్బుల్‌లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కే వెంకటేశ్వరరావు, గోపినాథ్, ప్రదీప్, బండి రవి, సందీప్, శివ, కోలా నరసమ్మ, నందిని, కళావతి పాల్గొన్నారు.